94931 70689 | www.rajadhanivartalu.com | rajadhanivartalu | rajadhaniv | RNI No. APTEL 2015/ 66622 | స్థాపితం : 2015 | Postal Regd No: GTR/84/2016-18

ముస్లింలారా ఏకంకండి
వక్ఫ్ ఆస్తులు రక్షించుకుందాం.
వక్ఫ్ ఆస్తులపై మీ వద్ద ఉన్న సమాచారాన్ని మాతో షేర్ చేయండి
వెబ్‌సైట్‌లో పొందుపరచి అందరికీ అందుబాటులో ఉంచుదాం.
76809 94755
wakfsoldiers@gmail.com
wakfproperties.blogspot.com
హుస్సేన్ ఖాన్, అమరావతి

# రాజధాని వార్తలు

Voice of Voiceless

PLCB డెవలపర్స్
రాజధాని అమరావతిలో రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కోసం సంప్రదించండి
76809 94755, 9676844442

అమరావతి సంపుటి : 3 సంచిక 21, పేజీలు 4 వేల: రూ. 2.00 | ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక | సోమవారం 12- ఆదివారం 18, ఫిబ్రవరి, 2018

## ఏపీకి చెప్పింది చేస్తున్నాం - హరిబాబు

**ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం అమలుకు కేంద్రం కట్టుబడి ఉంది**



**ఢిల్లీ :** కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగిందని ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ అంశంపై రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు స్పందించారు. ఏపీకి కేంద్రం మంజూరు చేసిన జాతీయ సంస్థలు, ప్రాజెక్టులు, నిధులపై 27 పేజీల నోట్‌ను హరిబాబు ఢిల్లీలో విడుదల చేశారు. ఏపీకి కేంద్రం నుంచి అందుతున్న సాహాయాన్ని వివరించారు.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని.. ఇప్పటికే రూ. 4 వేల కోట్లకు పైగా ఇచ్చారని వివరించారు. మోదీ ప్రభుత్వం తొలి భేటీలోనే పోలవరానికి సంబంధించిన 7 మండలాలపై నిర్ణయం తీసుకుందని గుర్తుచేశారు. ఉజ్వల్ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాలను ఏపీ పూర్తిస్థాయిలో వినియోగించుకుంటోందని అన్నారు. రాష్ట్రంలో గిరిజన, కేంద్రీయ విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు కేంద్రం అంగీకరించినట్లు చెప్పారు. రెండు విశ్వవిద్యాలయాలకు రూ. 10 కోట్ల చొప్పున కేంద్రం కేటాయిస్తోందని వెల్లడించారు. దుగరాజ పట్నం పోర్టు ఏర్పాటుకు పలు అభ్యంతరాలు వచ్చాయని.. దీంతో ప్రత్యామ్నాయ పోర్టు సూచించాలని ఏపీని కేంద్రం కోరిందని తెలిపారు. విశాఖ రైల్వే జోన్ కోసం కమిటీ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఏపీలో రూ. లక్ష కోట్లతో జాతీయ రహదారుల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రత్యేక హోదా ప్రకటిస్తే రాష్ట్రానికి ఎంతమేర లాభం చేకూరుతుందో.. అంతేమేర ఒక్క రూపాయి తగ్గకుండా ప్రత్యేక ప్యాకేజీని అమలు చేస్తామని కేంద్రం ప్రకటించిందని ఆయన అన్నారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం అమలుకు కేంద్రం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. ఇటీవల కొన్ని రాజకీయ పార్టీలు బంద్ పాటించాయని.. చట్టాన్ని రూపొందించి ప్రత్యేక హోదా అంశాన్ని చట్టంలో పెట్టనివాళ్లు కూడా బంద్‌లో పాల్గొన్నారని విమర్శించారు.

**ఆంధ్రా ప్రజల గొంతు కోసింది కాంగ్రెస్సే: నరసింహారావు**

ఆంధ్రా ప్రజల గొంతు కోసింది కాంగ్రెస్ పార్టీనేనని బీజేపీ నేత నరసింహారావు ఆరోపించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీజేపీ పై కొందరు వ్యతిరేక ప్రచారం చేస్తున్నారని.. ఏపీకి కాంగ్రెస్ చేసిన అన్యాయాన్ని బీజేపీ ప్రభుత్వమే సరిచేస్తోందన్నారు. ఏపీ వల్లే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏపీ ప్రజలనే మోసం చేసిందని మండిపడ్డారు. రాష్ట్రానికి కాంగ్రెస్ సరైన న్యాయం చేయలేదని.. విభజన హామీలన్నింటినీ నెరవేర్చేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. ఇప్పుడు రాహుల్‌గాంధీ కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని విమర్శించారు.

# విశాఖ రైల్వేజోన్‌పై ఎందుకు వివక్ష!

**అమరావతి :** విభజన హామీలు వెంటనే అమలు చేయాలని.. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని గత కొన్ని రోజులుగా పార్లమెంట్ వేదికగా రాష్ట్ర ఎంపీలు గళమెత్తిన విషయం తెలిసిందే. ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రా వూసెత్తకపోవడంతో ఏపీ తీవ్రంగా నిరాశ చెందింది. దీంతో తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ పార్లమెంట్‌లో ఆంధ్రా ఎంపీలు నిరసనకు దిగారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు సమకూర్చడంతో పాటు.. విశాఖ రైల్వే జోన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే విశాఖ రైల్వే జోన్‌పై మాత్రం కేంద్రం స్పందించకపోవడం గమనార్హం.

2014లో రాష్ట్ర విభజన నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే జోన్ తెలంగాణకు వచ్చింది. దీంతో ఆంధ్రాకు ప్రత్యేక రైల్వే జోన్ కేటాయించాలని ఏపీ డిమాండ్ చేస్తూ వస్తోంది. కానీ, కేంద్రం మాత్రం సరిగా స్పందించడం లేదు. అయితే తమ కంటే తక్కువ రైల్వే నెట్‌వర్క్ ఉన్న రాష్ట్రాల్లో జోన్ ఏర్పాటు చేసి ఏపీలో మాత్రం ఎందుకు చేయట్లేదనేది ఆంధ్రా నేతల వాదన.

ఆంధ్రప్రదేశ్‌లో 3,704 కిలోమీటర్ల మేర రైలు



పార్లమెంట్ వద్ద ప్లకార్డులతో ప్రదర్శన చేస్తున్న ఆంధ్రా ఎమ్.పీ.లు

మార్గాలు ఉన్నాయి. కానీ ఇక్కడ రైల్వే జోన్ లేదు. ఛత్తీస్‌గఢ్‌లో 1,213 కిలోమీటర్ల మేర రైలు నెట్‌వర్క్ ఉంది. అక్కడ ఆగ్నేయ మధ్య రైల్వే జోన్‌ను ఏర్పాటుచేశారు. ఒడిశా, కర్ణాటకల్లోనూ అలాగే జరిగింది. ఒడిశాలో 2,572 కిలోమీటర్ల మేర రైలు మార్గాలున్నాయి. అక్కడ ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్ ఉంది. ఇక కర్ణాటకలో 3,281 కిలోమీటర్ల రైల్వే నెట్‌వర్క్ ఉండగా.. నైరుతి రైల్వే జోన్‌ను ఏర్పాటుచేశారు. దీంతో తమ రాష్ట్రానికి ఎందుకు జోన్ ఏర్పాటు చేయట్లేదంటూ ఏపీ నేతలు ఆందోళన చేస్తున్నారు.

ప్రస్తుతం ఈ డిమాండ్ల విషయంలోనూ పార్లమెంట్‌లో పెద్ద ఎత్తున ఆందోళనలు జరిగాయి. అటు సోషల్‌మీడియాలోనూ ఈ రైల్వే జోన్ కోసం నెటిజన్లు కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇతర రైల్వే జోన్‌లతో పోలుస్తూ వీటికి సంబంధించిన కొన్ని పోస్టర్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారుతున్నాయి. మరి వీటిపై కేంద్రం ఎలా స్పందిస్తుందో చూడాలి.

తాజాగా దీనిపై బీజేపీ నేత కంభపాటి హరిబాబు మాట్లాడుతూ..విశాఖ రైల్వే జోన్ కోసం కమిటీ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఏపీకి కేంద్రం మంజూరు చేసిన జాతీయ సంస్థలు, ప్రాజెక్టులు, నిధులపై 27 పేజీల నోట్‌ను ఢిల్లీలో ఆయన విడుదల చేశారు. మరోపక్క మాజీ మంత్రి కొణతాల నేతృత్వంలో రైల్వే పూర్వ కార్మిక నాయకుల బృందం నూతన రైల్వే జోన్ ప్రతిపాదనలను రైల్వే మంత్రి పీయూష్ గోయల్, భారతీయ జనతాపార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షాలకు వివరించి చెప్పారు. వారు ఈ నూతన జోన్ కూర్పునకు సానుకూలంగా స్పందించారని సీనియర్ రైల్వే కార్మిక నాయకుడు చలసాని గాంధీ స్పష్టంచేశారు.

# అద్భుతంగా జరిగిన 'విటోపియా'






**రాజధాని ప్రతినిధి, అమరావతి :** అమరావతిలోని విట్ విశ్వవిద్యాలయలలో ఈ నెల 3వ తేదీ నుండి జరిగిన సాంస్కృతిక, క్రీడాపోటీలు శుక్రవారంతో ముగిసాయి. తదుపరి 9వ తేదీన అత్యంత వైభవంగా విటోపియా-2018 కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులలో ఆత్మవిశ్వాసం, కళలు, నాయకత్వలక్షణాలు, సృజనాత్మకత, పెంపొందించటానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాలతో పాటు దాదాపు 40 ఇంజనీరింగ్ కళశాలా విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మానవ వనరుల అభివృద్ధి శాఖమంత్రి గంటా శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఎపి విట్ విద్యార్థులు అన్నీ రంగాలలో తమసత్తాచాటి విట్‌కు అంతర్జాతీయ ఖ్యాతి నందించాలని కోరారు. విట్ భవనాలు అతితొందరగా నిర్మాణం చేసి వివిధ కోర్సులో ప్రవేశం కల్పిస్తామని విట్ విశ్వవిద్యాలయ కులపతి డా. విశ్వసాధన్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో విట్ ఉపకులపతి డా. శేఖర్ విశ్వనాధన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా.సంధ్య, వైస్ ఛైర్మన్ డా. సుధాకర్ పాల్గొన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య సి.ఎల్.వి. శివకుమార్ మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల సంస్కృతీ సాంప్రదాయాలు తెలుసుకోవటానికి ఈ పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఆటపాటలతో సాగిన ఈ విటోపియా కార్యక్రమం విద్యార్థులను, స్థానికులను ఎంతో ఆకట్టుకున్నాయని రిజిస్ట్రార్ తెలిపారు. మ్యూజికల్ నైట్‌షోతో విద్యార్థులు, బాలివుడ్ గాయకుడు బెన్నిదయాళ్, టాలివుడ్ గాయని దామిని బాట్ల పాటలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి.

## తప్పుడు లెక్కలు చెబితే ఊరుకోవద్దు: చంద్రబాబు



**అమరావతి:** రాష్ట్ర విభజన హామీలపై ఢిల్లీలో జరిగిన తాజా రాజకీయ పరిణామాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు మరోమారు సమీక్షించారు. ఉండవల్లిలోని తన నివాసం నుంచి ఢిల్లీలో కేంద్రమంత్రి సుజనాచౌదరి, ఎంపీలు సీఎం రమేష్ తదితర ముఖ్యనేతలతో టెలీకానారేన్స్ నిర్వహించారు. అటు తన నివాసంలోనూ ముఖ్యమైన నేతలు, అధికారులతో కూడా తాజా పరిణామాలపై సమీక్ష నిర్వహించారు. విభజన హామీలపై కేంద్రప్రభుత్వం స్పష్టత ఇచ్చేంతవరకూ వేచిచూసే ధోరణి అవలంబించాలని పార్టీ నేతలకు చంద్రబాబు స్పష్టంచేశారు. బీజేపీ నేతలు ఎవరైనా విభజన హామీలకు సంబంధించి తప్పుడు లెక్కలు చెబితే ధీటుగా స్పందించాలని సీఎం సూచించినట్లు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి మరోమారు ప్రకటన వచ్చేంతవరకూ వేచిచూడాలని నిర్ణయించినట్లు సమాచారం. అలాగే, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావును ఢిల్లీకి వెళ్లాల్సిందిగా ముఖ్యమంత్రి సూచించారు.

## 12 నుంచి జలసంరక్షణ ఉత్సవం

**116 రోజులు నీరుప్రగతి- జలసంరక్షణ ఉద్యమం**
**జూన్ లో నీటి సంఘాలకు ఎన్నికలు**



**రాజధాని ప్రతినిధి, వెలగపూడి :** ఈ నెల 12 నుంచి జూన్ 7వ తేదీ వరకు 116 రోజులు నీరుప్రగతి -జలసంరక్షణ రెండవ విడత ఉద్యమ కార్యక్రమం ఓ ఉత్సవంలాగా నిర్వహించనున్నట్లు జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు చెప్పారు. సచివాలయం 5వ బ్లాక్ సమావేశ మందిరంలో జరిగిన నీరు-ప్రగతి ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో నీరు- చెట్టు పనుల ప్రగతిని సమీక్షించారు. వచ్చే ఏడాది రూపొందించిన పనుల ప్రణాళికపైన, జల సంరక్షణ ఉద్యమంలో చేపట్టే పనులపైన చర్చించారు. చేపట్టిన పనులను, పూర్తి చేసిన పనుల వివరాలను సంబంధిత శాఖల అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి దేవినేని, జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్ కుమార్ లు పనులు విషయమై శ్రీకాకుళం, అనంతపురం, ప్రకాశం, చిత్తూరు జిల్లా కలెక్టర్లతో కూడా మాట్లాడారు. నీటి సంఘాల భాగస్వామ్యంతో జల సంరక్షణ ఉద్యమంలో చేపట్టే చెరువుల మరమ్మతులు, చెరువులు అనుసంధానం, కాలువల్లో పూడిక తొలగింపు, చెక్ డ్యామ్‌ల నిర్మాణం, ఊట గుంటల నిర్మాణం, నేలలో తేమ పెంపు పనులు, వాననీటి సంరక్షణ, కాంటూర్ కందకాలు, రాక్ ఫిల్ డ్యామ్స్, అటవీ సరిహద్దు కందకాలు, భూగర్భజలాల పెంపు, ఊరూరా జలగణన, ఇతర జల సంరక్షణ నిర్మాణాలపై చర్చించారు. వర్షాలు పడిన వెంటనే నీరు భూమిలో ఇంకే ఏర్పాట్లు చేసినట్లు అధికారులు చెప్పారు. పెరిగిన భూముల సాగు, పంటల విస్తీర్ణ, సాగు నీరు, నివాస ప్రాంతాలకు త్రాగునీరు, వనసంరక్షణ సమితులు, ఫారంఫాండ్స్, బోర్ వెల్స్ రీఛార్జి చెరువులలో నీటి నిల్వ, వాటర్ షెడ్ల ఏర్పాటు తదితర అంశాలను చర్చించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈఆర్థిక సంవత్సరంలో పూర్తి చేయదలసిన పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కడప జిల్లాలో చెక్ డ్యామ్‌ల నిర్మాణం బాగుందని ప్రశంసించారు. అక్కడ భూగర్భ జలాలు గణనీయంగా పెరిగినట్లు తెలిపారు. అక్కడ అభివృద్ధిని పరిశీలించమని అధికారులకు చెప్పారు. జూన్ లో నీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతాయని, తగిన ఏర్పాట్లు చేసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో జలవనరులు, గ్రామీణాభివృద్ధి, భూగర్భ జలాలు, అటవీ, ఆంధ్రప్రదుశ్ శాటిలైట్ అప్లికేషన్ సెంటర్, వ్యవసాయ, ఉద్యానవన,మత్స్య పశుసంవర్ధక, గ్రామీణ నటీసరఫరా, మూనిసిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ముగ్గురు ఐజీలకు అదనపు డీజీపీలుగా పదోన్నతి

**సీఐడీకి అమిత్‌గార్గ్, సైబర్ క్రైమ్‌కు సునీల్‌కుమార్**

**రాజధాని,ప్రతినిధి- అమరావతి :** పోలీసుశాఖలో ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీ)గా పని చేస్తున్న 1993 ఐపీఎస్ బ్యాచ్‌కి చెందిన ముగ్గురికి అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు (ఏడీజీపీ)గా పదోన్నతి లభించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. సీఐడీలో ఐజీగా పని చేస్తున్న అమిత్‌గార్గ్‌కు అదనపు డీజీపీగా పదోన్నతి కల్పించి తిరిగి సీఐడీలోనే పోస్టింగ్ ఇచ్చారు. అలాగే స్టేట్ క్రైమ్ రికార్డ్ బ్యూరో (ఎస్‌సీఆర్‌బీ), సైబర్ క్రైం ఐజీగా ఉన్న పీవీ సునీల్‌కుమార్‌కు అదనపు డీజీపీగా పదోన్నతి కల్పించి తిరిగి అదే పోస్టులో నియమించారు. కేంద్ర సర్వీసులకు వెళ్లి బీహార్‌లోని పాట్నాలో ఎస్‌ఐబీ జాయింట్ డైరెక్టర్‌గా ఉన్న డాక్టర్ మహేష్ దీక్షిత్‌కు కూడా అదనపు డీజీపీగా పదోన్నతి లభించింది.

# తల్లీబిడ్డల ఆరోగ్యంపై ప్రభుత్వ నిర్లక్ష్యం

- రాష్ట్రంలో అందని మాతృవందన సాయం
- పీఎంఎంవీవై పథకానికి తూట్లు




**విశాఖపట్నం :** తల్లీబిడ్డల ఆరోగ్యంపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ నిర్లక్ష్య ప్రదర్శిస్తోంది. దీంతో ప్రధాన్ మంత్రి మాతృవందన యోజన (పీఎంఎంవీవై) పథకం నీరుకారిపోయింది. రాష్ట్రంలోని లక్షలాది మంది గర్భిణులు,పాలిచ్చే తల్లులకు పోషకాహారం అందడం లేదు. పోషకాహారం లోపంతో గర్భిణులు, బాలింతల్లో తలెత్తే సమస్యలను నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం 2017 జనవరి 1న ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. దీనిలో భాగంగా రూ. 6000లను మహిళలకు అందచేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకంపై అవగాహన - సహకారం కల్పించనందుకు గాను రాష్ట్రంలోని దాదాపు 4 లక్షల మంది గర్భిణులు ఈ సాయం అందుకోలేక పోయారు. అంగన్‌వాడీల ద్వారా ఈ పథకాన్ని అమలు చేయాల్సిన వైద్య, ఆరోగ్యశాఖ నమోదు ప్రక్రియ క్లిష్టతరంగా ఉండటం వల్లే సక్రమంగా అమలు చేయలేక పోయామని చెబుతోంది. కనీసం గర్భిణుల వివరాలను కూడా ఈ శాఖ నమోదు చేయలేదు. రాతపని ఎక్కువగా ఉండటం, ఇంటర్‌నెట్ కనెక్షన్ సరిగా ఉండకపోవడం, బ్యాంకు ఎకౌంట్లు లేకపోవడం, డాక్టర్ల నివేదికల కంప్యూటీకరణ జరగక పోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. 2017-18లో (ఫిబ్రవరి5వరకు) మహారాష్ట్రలో 50,831 మంది గర్భిణులు, బాలింతలు ప్రయోజనం పొందారు. ఉత్తరప్రదేశ్‌లో 40,252 మంది, మధ్యప్రదేశ్‌లో 37,209 మందికి సాయం అందించారు. వెనుకబడిన రాష్ట్రమైన చత్తీస్‌ఘడ్‌లో కూడా 27,702 మంది పీఎంఎంవీవై లో ప్రయోజనం పొందగా, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం 2,352 మంది మాత్రమే దీనిని వినియోగించుకున్నారు. ఈ పథకంలో మూడు విడతలుగా రూ. 6000 అందిస్తారు. గర్భవతిగా నమోదు చేసుకున్న తర్వాత రూ. 1000, రెండో దఫా మరోరూ. 2000 ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం అయిన తర్వాత మరో రూ. 2000లు ఆపై మరో రూ.1000 నేరుగా ఆ మహిళా బ్యాంకు ఎకౌంట్లో జమ చేస్తారు. సిబ్బందికి రాతకోతల పని ఎక్కువగా ఉండటం వల్లనే ఈ పరిస్థితి తలెత్తిందని, గ్రామీణ, గిరిజన ప్రాంతాల వారికి బ్యాంకు ఎకౌంట్లు లేవని వైద్య ఆరోగ్య శాఖ తెలిపింది. మార్చి చివరినాటికి ప్రస్తుతం ఉన్న వివరాలను కంప్యూటరీకరించి రాష్ట్రంలో అర్హులైన 3.5 లక్షల మందికి ప్రయోజనం చేకూర్చుతామని పేరు చెప్పటానికి ఇష్ట పడని ఒక అధికారి వెల్లడించారు. ఈ పథకం అమలు చేపట్టిన తర్వాత ఇప్పటి వరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో 3.5 లక్షల మంది ప్రసవాలు జరిగాయని ,అయితే వాటిని ఈ పథకంలో నమోదు చేయలేదన్నారు. ఒక్క విశాఖలోనే 21,785 మంది అర్హులు ఉండగా, ఇప్పటి వరకు మొదటి విడత నగదు రూ. 1000 కేవలం 62 మందికే లభించింది.

# మే 6న నీట్

- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం
- 15% జాతీయకోటాకు తెలుగు రాష్ట్రాల విద్యార్థులకూ ఆర్హత
- ఆధార్ తప్పనిసరి

**న్యూఢిల్లీ :** మెడికల్/ డెంటల్ కాలేజీల్లో ప్రవేశాల కోసం జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్-2018)ను మే నెల 6వ తేదీన నిర్వహించనున్నామని సీబీఎస్ఈ ప్రకటించింది. దేశవ్యాప్తంగా వివిధ వైద్య/దంత కళాశాలల్లో ఎంబీబీఎస్/బీడీఎస్ కోర్సుల్లో చేరగోరే విద్యార్థులు నీట్ కోసం దరఖాస్తు చేసుకొనేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైందని పేర్కొన్నది. మార్చి 7వ తేదీ వరకు దరఖాస్తు చేసుకొవచ్చని తెలిపింది. పరీక్షను హిందీ, ఇంగ్లిష్‌తోపాటు తెలుగు, గుజరాతీ, తమిళం, కన్నడ, మరాఠీ, ఒరియా, బెంగాలీ, అస్సామీ భాషల్లో నిర్వహిస్తామని పేర్కొన్నది. నీట్ 2018 అధికార వెబ్‌సైట్‌లో విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించింది. సీబీఎస్ఈ జారీచేసిన నోటిఫికేషన్ ప్రకారం ఓపెన్ స్కూల్ విద్యార్థులు నీట్ రాయడానికి అనర్హులు. భారత పౌరులు, ప్రవాస భారతీయులు (ఎన్ఆర్ఐ), విదేశాలలో ఉన్న భారతీయులు (ఓసీఐ), విదేశాల్లో ఉన్న భారత సంతతికి చెందిన వారు (పీఐవో), విదేశీయులు నీట్- 2018కు అర్హులు. అభ్యర్థులు ఎంబీబీఎస్/బీడీఎస్ మొదటి సంవత్సరం కోర్సులో చేరే సమయానికి లేదా ఈ ఏడాది డిసెంబర్ 31నాటికి 17 ఏండ్లు నిండినవారై ఉండాలి. గరిష్ఠ వయోపరిమితిని 25 ఏండ్లుగా విధించారు. ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ విద్యార్థులకు ఐదేండ్ల సడలింపు నిచ్చారు. ఈ ఏడాది 12వ తరగతి పరీక్షలు రాసున్న విద్యార్థులు కూడా నీట్ రాయవచ్చని సీబీఎస్ఈ తెలిపింది. తెలంగాణ, ఏపీ రాష్ట్రాలు 2018-19 విద్యా సంవత్సరం నుంచి తమ ఎంబీబీఎస్/బీడీఎస్ సీట్ల కేటాయింపులో 15% జాతీయ కోటాను అనుమతించాలని నిర్ణయించినందున ఆ రెండు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు కూడా 15% జాతీయకోటాకు అర్హత పొందుతారని వివరించారు. పూర్తి వివరాలు నీట్- 2018 వెబ్‌సైట్ http ://cbse neet.nic,in లో ఉన్నట్టు సీబీఎస్ఈ పేర్కొంది.

**ఆధార్ నంబర్ తప్పనిసరి**

ఎంబీబీఎస్. డెంటల్ కోర్సులో ప్రవేశాలకు నిర్వహించే జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్)కు ఆధార్ నంబర్ తప్పనిసరి అని సీబీఎస్ఈ స్పష్టం చేసింది. అసోం, మేఘాలయ, జమ్మూకశ్మీర్ మినహా మిగిలిన రాష్ట్రాల అభ్యర్థులు ఆధార్ నంబర్‌ను దరఖాస్తులో నింపాలని సూచించింది. లేని యెడల ఆ దరఖాస్తును భర్తీ చేయడం సాధ్యం కాదని సీబీఎస్ఈ స్పష్టం చేసింది. నీట్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో ఆధార్ నంబర్ విషయంలో విద్యార్థుల తల్లిదండ్రులు జాగ్రత్తపడాలి. ఇప్పుడు ఇంటర్ చదువుతున్న చాలా మంది విద్యార్థులు.. ఆధార్ కార్డులను వారి చిన్న వయసులో దిగి ఉంటారు. విద్యార్థుల ఆధార్ కార్డులోని ఐరిస్, ఫింగర్ ప్రింట్స్ ప్రస్తుతం వారి వయసు రీత్యా వ్యత్యాసం రావొచ్చు. ఇటీవలే జేఈఈకి దరఖాస్తు చేసుకున్నప్పుడు.. ఇంటర్ విద్యార్థులు ఈ సమస్యను తీవ్రంగా ఎదుర్కొన్నారు. కావున తల్లిదండ్రులు అప్రమత్తమై తక్షణమే సమీపంలో ఉన్న ఆధార్ సెంటర్లలో కొత్తగా ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవడం మంచిది.

పాఠకులకు, ప్రకటనకర్తలకు, ఏజెంట్లకు, శ్రేయోభిలాషులకు, ఎన్.ఆర్.ఐ మిత్రులకు
మహాశివరాత్రి శుభాకాంక్షలు
- రాజధాని వార్తలు

మీరూ స్పందించండి
మీరు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలపై స్పందించండి
యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లేందుకు రాజధాని వార్తలు వేదికగా నిలుస్తుంది.
మీరు చేయాల్సిందల్లా సమస్యను ఫోటో తీసి, పరిస్థితిని క్లుప్తంగా వివరించి వాట్సప్ ద్వారా మీ పేరుతో సహ ఈ దిగువ ఉన్న వాట్సాప్ నంబర్లకు పంపించండి.
94406 62699

జె.మనోజ్ కుమార్ సెల్: 9640811333
సాయి గణేష్ ట్రేడర్స్




అడ్రస్సు : యన్.టి.ఆర్ సర్కిల్, మెయిన్ రోడ్, వెలగపూడి,గుంటూరు జిల్లా, (అమరావతి సచివాలయ ప్రాంతం)-522503.
E mail : sgtvelagapudi@gmail.com

# రాజధాని వార్తలు

కలం

## కేంద్రంపై తిరుగుబాటు బావుటా...

రాష్ట్ర బంద్‌కు ప్రజలు పూర్తిస్థాయిలో స్వచ్ఛందంగా సహకరించడం కేంద్రంపై తమకున్న ఆగ్రహాన్ని తెలపడమేకాదు తిరుగుబాటు బావుటాను ఎగురవేయడమే అని రాష్ట్ర బీజేపీ గుర్తించాలి.ప్రధాని మోడీ అమరావతిలో రాజధాని నిర్మాణానికి ప్రత్యేక హెలికాప్టర్‌లో వస్తూ తనతోపాటు చెంబుడు గంగానది నీళ్లు, ఆధునిక దేవాలయమైన పార్లమెంటులోని మట్టి తెచ్చాననడం ఆంధ్రప్రదేశ్ వాసులు అసంతృప్తి వెలిబుచ్చారు. నిజానికి ఇక్కడి ప్రజలంతా నూతనరాజధాని నిర్మాణానికి ఎంతో కొంత సాయం చేస్తారని ఆశించారు... మరో తెలుగురాష్ట్రం ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావు ఇదే కార్యానికి వస్తూ దాదాపు రూ. 2 వేల కోట్లు తెచ్చికూడా, రాష్ట్ర నిర్మాణానికి ఈ మొత్తాన్ని విరాళంగా ప్రకటిస్తే మోడీ చిన్నబుచ్చుకుంటారని మారు మాట మాట్లాడకుండా రెండు మంచి మాటలు చెప్పి వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఈ నాలుగేళ్ల కాలంలో కేంద్రంలో అధికార బీజేపీ రాష్ట్ర ప్రజలను తీవ్రంగా విసిగిస్తున్నారనడంలో సందేహం లేదు. ప్రధాని నీళ్లు, మట్టి ఇచ్చిన వెంటనే గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ ఆయనపై విరుచుకుపడ్డారు. అయితే అధికార పార్టీ అధిష్టానం ఆయనను నియంత్రించింది. ప్రత్యేక హోదా కాదని, ప్యాకేజీ ప్రకటించడం దానిపై ఎదురుతిరిగిన ప్రతిపక్షాలు, వామపక్షాలపై అధికార ఎన్డీఏ భాగస్వామ్యులు చిన్నబుచ్చడం ఒక ప్రహసనంగా మారింది. ఆపై కేంద్రం ఒక్కో వాగ్దానం నుంచి తప్పుకుంటూ రాష్ట్రాన్ని గాలికి ఒదిలేసినా కేంద్రాన్ని తప్పుపట్టడంలో మిగతా తెలుగుదేశం నేతలు ఎంతమాత్రమూ సహకరించని మాట మాత్రం వాస్తవం. వారి వ్యాపారాలు, అవినీతి భాగోతాలు బయటపడతాయేమోనని వారు మిన్నకుండిపోయిన విషయాన్ని రాష్ట్ర ప్రజలు గుర్తిస్తున్నారు. అయితే ఎన్డీఏయే భాగస్వామిగా ఉంటూ కూడా అనేక సందర్భాల్లో కేంద్ర దుర్నీతిపై గళం విప్పిన వ్యక్తి గల్లా జయదేవ్ మాత్రమే. పార్లమెంటులో మిత్రద్రోహంపై ఆయన ఏకరువు పెడుతూ, ఇలా అయితే రానున్న రోజుల్లో ఏపార్టీ అయినా మీతో జతగట్టడానికి వస్తుందా ? రాష్టానికి చట్టబద్దంగా రావాల్సిన నిధులను ఎందుకు చెల్లించడం లేదు ? తెలుగు రాష్ట్రంలో నిర్మితమైన బాహుబలి వసూళ్ల కంటే తక్కువే మీరు మాకిచ్చారని కుండ బద్దలు కొట్టినట్లు చెప్పడమే కాకుండా, ఇలా చేస్తే భరించడానికి ప్రజలేమీ ఫూల్స్‌కాదని హెచ్చరించడం ముదావహం. ఆయన కొద్దిసేపే ప్రసంగించినప్పటికీ ఆయన మాటల్లోని వాస్తవాలను గ్రహించిన బీజేపీ సభ్యులు, మంత్రులు మారు మాట్లాడ లేదు. ఏది ఏమైనా కాంగ్రెస్ హయాంలో విభజన సమయంలో ప్రజలంతా ఎంత ఆవేదనను అనుభవించారో ..అంతే ఆవేదనను ఇప్పుడు కూడా భరించవలసి రావడం దురదృష్టం. సమర్థనాయకత్వం లేకపోతే ప్రజలు నానా అగచాట్లు పడతారనడానికి ఇదే నిదర్శనం. నాలుగేళ్లలో ప్రాణం పోతున్నా గుక్కెడు నీళ్లుకూడా పోయని మోడీ ప్రభుత్వం ఇంకా కాంగ్రెస్ వల్లే ఇలా జరిగిందని చెప్పడం ఆయనపై వ్యతిరేకతను పెంచే చర్యే అని చెప్పక తప్పదు.

రాష్ట్రాన్ని విభజించింది కాంగ్రెస్ అయినా అందుకు ప్రోత్సహించింది, సానుకూల వాతావరణం ఏర్పాటు చేసింది ఖచ్చితంగా బీజేపీయే అని మరిచిపోరాదు. ఎందుకంటే చిన్న రాష్ట్రాలకు మేము అనుకూలం అంటూ కాకినాడ సమావేశంలో తేల్చి చెప్పింది బీజేపీ.. కాంగ్రెస్ రాష్ట్రాన్ని విభజించకపోతే బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత విభజిస్తుందని, అప్పటికే చత్తీస్‌ఘడ్, ఉత్తరాఖండ్‌లను విభజించామని ఆపార్టీ గొప్పలు చెప్పుకున్న విషయం వాస్తవం కాదా ?. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ ఆ నిర్ణయం తీసుకోకపోతే ఎన్నికల్లో నష్టపోతామనే ఉద్దేశ్యంతో విభజనకు పూనుకొంది. ఈ విభజనలో చిన్నమ్మ సుష్మాస్వరాజ్ హస్తం ఉందని మరిచిపోరాదు. రాష్ట్రం విడిపోయాక అంతా కాంగ్రెస్ చేసిందని ఆడిపోసుకోవడం అనవసరం. బీజేపీ అప్రజాస్వామ్య ధోరణులతో ముందుకెళుతోంది. ఈ పార్టీకి సిద్ధాంతాలు, కట్టుబాట్లు, క్రమశిక్షణ ఏమీ లేవని ప్రజలు గుర్తిస్తున్నారు. దీంతో రాబోయే కాలంలో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయోనని ప్రజలు వాపోతున్నారు.

## ఈ చైర్మన్ మాకొద్దు



- **బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌పై టీడీపీ అధిష్టానానికి ఫిర్యాదు**

**అమరావతి :** బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ వేమూరి ఆనందసూర్యపై ఆ పార్టీ బ్రాహ్మణ సంఘం నాయకులు తిరుగుబాటు చేశారు. ఆయన చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచీ ఒంటెత్తు పోకడలతో పార్టీని, కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేస్తున్నారని కార్పొరేషన్‌కు చెందిన పలువురు డైరెక్టర్లు, జిల్లా నియోజకవర్గాల సమన్వయకర్తలు అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గుంటూరులోని రాష్ట్ర పార్టీ కార్యాలయానికి వచ్చిన 13 జిల్లాల నేతలు టీడీపీ కార్యక్రమాల నిర్వహణ కమిటీ చైర్మన్ వీవీవీఎస్ చౌదరికి ఫిర్యాదు చేశారు. తామంతా మూడేళ్లుగా బ్రాహ్మణ కార్పొరేషన్ పథకాలను క్షేత్రస్థాయికి తీసుకువెళ్లి అర్హులైన లబ్ధిదారులను గుర్తించి సాయం చేస్తున్నామన్నారు. కార్పొరేషన్ చైర్మన్‌గా ఆనందసూర్య బాధ్యతలు చేపట్టాక అధిష్టానానికి తెలియకుండా జిల్లా సమన్వయకర్తలను ఏకప క్షంగా రద్దు చేశారన్నారు. తెలంగాణాకు సంబంధించిన రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘాన్ని ఏపీలోనూ బలోపేతం చేసుకునేందుకు పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడు తున్నారని ఆరోపించారు. ఆ సంఘంలో సభ్యత్వం తీసుకున్న వారికే కార్పొరేషన్‌లో పదవులు కేటాయిస్తూ..వారికే ఆయా పథకాలు అమలు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లు గుమ్మా నాగరాజు (శ్రీకాకుళం), దవ్వూరి సురేష్ (తూర్పు గోదావరి), యామిజాల నరసింహ మూర్తి (పశ్చిమ గోదావరి), నేపాక పద్మావతి (గుంటూరు) తో పాటు 13 జిల్లాల కో ఆర్డినేటర్లు, నియోజకవర్గాల సమన్వయకర్తలు ఉన్నారు.




# తాగునీటికీ అప్పు..!

- రూ. 5,300 కోట్ల బ్యాంక్ రుణం
- వడ్డీ రేటు 7.9 శాతం
- కుటుంబానికి 70 లీటర్ల నీరు
- 8 జిల్లాలకు రూ.6,300 కోట్ల ప్రాజెక్టు
- గ్యారంటీగా రాష్ట్ర ప్రభుత్వం



**రాజధాని ప్రతినిధి, అమరావతి :** ప్రజలకు మౌలిక కల్పనకు ప్రభుత్వం అష్టకష్టాలు పడుతోంది. దాదాపుగా అన్ని శాఖలూ ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. కనీసం రూ. 1000 కోట్ల విలువైన ప్రాజెక్టులను చేపట్టేస్థితిలో ప్రభుత్వశాఖలు లేకపోవటం గమనార్హం. వ్యవసాయం, విభాగాల్లో అభివృద్ధి పనులకు బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల నుంచి రుణాలు తీసుకోవటం లేదా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) విధానంలో ప్రాజెక్టులను చేపట్టేందుకే ప్రభుత్వం మొగ్గు చూపుతోంది. నదుల అనుసంధానంతో అన్ని ప్రాంతాలకు తాగు, సాగునీటి కొరత లేకుండా చేస్తామని పదే పదే చెబుతున్న ప్రభుత్వం... ప్రజలకు తాగునీటి సౌకర్యాన్ని కల్పించేందుకు అప్పులు చేయాలని నిర్ణయం తీసుకోవటం గమనార్హం. కొన్ని జిల్లాల్లో పీపీపీ విధానంలో ప్రాజెక్టులను చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. వెనుకబడిన ఉత్తరాంధ్ర మూడు జిల్లాలతోపాటు కోస్తాలోని ఐదు జిల్లాలకు తాగునీటిని సరఫరా చేసేందుకు రుణం తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. గృహ వినియోగానికి రోజుకు 72 లీటర్ల తాగునీటిని సరఫరా చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందులో భాగంగానే ఉత్తరాంధ్రలోని తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో నూరు శాతం ఇళ్లకు 70 లీటర్ల తాగునీటిని సరఫరా చేసేందుకు ప్రణాళికను రూపొందించింది. రూ. 6,300 కోట్లతో చేపట్టే ఈ ప్రాజెక్టుకు రూ. 1000 కోట్లనే కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. మిగిలిన రూ. 5,300 కోట్లను ప్రభుత్వరంగ సంస్థల నుంచి రుణంగా తీసుకోవాలని సూచించింది. ఆంధ్రప్రదేశ్ తాగునీటి సరఫరా సంస్థ (ఏపీడీడబ్ల్యుఎస్‌సీ) ఈ రుణాన్ని తీసుకునేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ ఇవ్వనుంది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. తాగునీటి సరఫరా విభాగంలో మౌలిక సదుపాయాలు కల్పించటంతోపాటు ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రభుత్వ రంగంలోకి వాణిజ్య బ్యాంకుల నుంచి ఈ రుణాన్ని పొందేందుకు ప్రభుత్వం అనుమతించింది. అయితే వడ్డీ రేటు మాత్రం 7.9 శాతానికి మించకూడదని షరతు విధించింది. ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చినందుకు ఏపీడీడబ్ల్యుఆర్‌సీ రెండు శాతం కమీషన్‌ను ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది.

**పీపీపీ విధానంలో రాయలసీమలో రూ. 9,400 కోట్ల ప్రాజెక్టు**

రాయలసీమ నాలుగు జిల్లాలతోపాటు నెల్లూరు జిల్లాలో తాగునీటి వ్యవస్థను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం పీపీపీ విధానాన్ని ఎంచుకుంది. అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు, నెల్లూరు జిల్లాల్లో రూ. 9,400 కోట్లతో తాగునీటి ప్రాజెక్టును చేపట్టేందుకు పంచాయతీరాజ్‌శాఖ ఆమోదం తెలిపింది. హైబ్రిడ్ యాన్యూటీ విధానంలో అన్ని గ్రామాలకు పూర్తిస్థాయిలో తాగునీటిని సరఫరా చేయాలని నిర్ణయించింది. పీపీపీ విధానంలో అన్ని గ్రామీణ తాగునీటి సరఫరా చేసేందుకు ఎంతమేర ఖర్చువుతుందో కూడా అంచనాలు రూపొందించాలని పేర్కొంది. పీపీపీ విధానంలో చేపట్టే ప్రాజెక్టు కోసం ప్రత్యేకంగా టెక్నికల్ కమిటీని కూడా నియమించాలని ప్రభుత్వం తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

# రూ. 3 వేల కోట్లు అర్జెంట్...!

- నిధులు ఆలస్యమైతే ప్రాజెక్టు ఆలస్యం
- రివ్యూలో సీఎంకు అధికారుల వినతి
- పోలవరం ప్రాజెక్టు ప్రగతిపై వివరణ

**రాజధాని ప్రతినిధి- అమరావతి :** పోలవరం ప్రాజెక్టులో కీలకమైన స్పిల్‌వే, స్పిల్ చానల్, అప్రోచ్ చానల్ పైలెట్ చానల్ రేడియల్ గేట్ల ఉర్పాటు, దయాఫ్రమ్‌వాల్ తదితర పనులకు సంబంధించిన పనులు అనుకున్న గుడువులోగా పూర్తి కావాలంటే తక్షణమే రూ. 3 వేల కోట్ల నిధుల అవసరమని అధికారులు చెప్పారు. సచివాలయంలోని తన కార్యాలయంలో పోలవరం సహా ప్రాధాన్య ప్రాజెక్టుల పనుల ఎంతవరకు వచ్చాయో ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు పోలవరం ప్రాజెక్టు 53 శాతం పూర్తైందని, కుడి ప్రధాన కాలువ 91 శాతం, ఎడమ ప్రధాన కాలువ 60 శాతం నిర్మణం పూర్తి చేసినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. హెడ్ వర్క్స్ 39 శాతం పూర్తికాగా, దయాఫ్రమ్ వాల్ నిర్మిణం 66 శాతం పూర్తయిందని తెలిపారు. 71 శాతం వరకు స్పిల్‌వ్, స్పిల్ చానల్ తవ్వకం పనులు, 14 శాతం మేర కాంక్రీట్ నిర్మాణం చేపట్టామని వెల్లడించారు. రేడియల్ గేట్ల ఫ్యాబ్రికేషన్ 58 శాతం పూర్తయ్యిందని చెప్పారు. 82 వేల క్యూబిక్ మీటర్ల వరకు ఎర్త్‌వర్క్ తవ్వకం పనులు, 5,314 క్యూబిక్ మీటర్ల వరకు స్పిల్‌వే, స్టిల్లింగ్ బేసిన్ కాంక్రీట్ పనులు, 18.8 మీటర్ల మేర దయాఫ్రమ్ వాల్ నిర్మాణం ఈ వారం రోజుల్లో చేపట్టినట్టు ముఖ్యమంత్రికి తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం మొత్తం రూ. 12,915.38 కోట్లు ఖర్చు చేయగా, ఇందులో జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన తర్వాత ఖర్చు చేసిన మొత్తం రూ. 7,779.52అని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. ఈ మొత్తంలో గతేడాది డిసెంబరు 31 వరకు కేంద్రం రాష్ట్రానికి రూ. 4,329.06 కోట్లు ఇచ్చిందని చెప్పారు. వరద మళ్లింపునకు సంబంధించి స్పిల్‌వే, స్పిల్ చానల్, పైలెట్ చానల్, రేడియల్ గేట్ల ఏర్పాటు, దయాఫ్రమ్ వాల్ తదితర పనులకు రూ. 4,375.73 కోట్లు వ్యయం కానుందని అధికారులు అంచనా వేశారు. 2019 కల్లా పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఇప్పటికీ రూ. 1,531.53 కోట్లు ఖర్చు చేయగా మరో రూ. 2,844,20 కోట్లు అవసరం ఉందని, వీటిని తక్షణమే సమకూర్చాలని కోరారు. లేనిపక్షంలో ప్రాజెక్టు ఆలస్యమయ్యే ప్రమాదం ఉందన్నారు. సీఎం అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటానని తెలిపారు.

**ముఖ్యమంత్రికి అభినందనలు**

పోలవరం ప్రాజెక్టు సాధనే ధ్యేయంగా మూడున్నరేళ్ల నుంచి అహోరాత్రులు అంకితభావంతో పనిచేస్తూ ఇప్పటివరకు 50 సార్లు వర్చువల్ ఇన్‌స్పెక్షన్ చేశారని కొనియాడుతూ ముఖ్యమంత్రిని మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్, ఈ ఎన్‌సీ వెంకటేశ్వరావు,నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మార్చి 5వ తేదీ నుంచి
## ఏపీ అసెంబ్లీ సమావేశాలు, 8న బడ్జెట్

**రాజధాని ప్రతినిధి- అమరావతి :** అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మార్చి 5 నుంచి 28 వరకు జరపాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ సమావేశాల్లో 8న ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నట్లు సమాచారం. ఉగాది పండుగా రెండో శనివారం వచ్చినందున ఆ రోజు సెలవు. అదివారాలుపోను మిగిలన 16 రోజులు అసెంబ్లీ సమావేశాలు జరుగుతాయి. 28న ద్రవ్య వినిమయ బిల్లుతో అసెంబ్లీ సమావేశాలు ముగుస్తాయి. అయితే ఈసారి జరగనున్న అసెంబ్లీ సమావేశాలకు ప్రతిపక్ష వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు హాజరవుతారో లేదో అన్నదానిపై స్పష్టత లేదు. ఆ పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్ర పేరుతో రాష్ట్రంలో పాదయాత్ర చేస్తున్నారు. గడిచిన శీతాకాల అసెంబ్లీ సమావేశాలను వైసీపీ సభ్యులు బహిష్కరించారు. ప్రతిపక్ష పార్టీ సభ్యులు లేకుండా అసెంబ్లీ చరిత్రలో శీతాకాల సమావేశాలు జరిగాయి. ప్రస్తుతం మిత్రపక్షాలుగా ఉన్న తెలుగుదేశం, బీజేపీల మధ్య కేంద్ర బడ్జెట్ చిచ్చు రగిలి పార్లమెంట్‌లో టీడీపీ సభ్యులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా గత ఐదురోజులుగా పోరాటం చేస్తున్నారు. అయితే కేంద్రం ఇప్పటివరకు దిగిరాలేదు. కేంద్రం ఏపీకి న్యాయం చేయకపోతే మిత్రపక్షంగా కొనసాగేందుకు టీడీపీ అధినాయకత్వం సుముఖంగా లేనట్టు ప్రచారం జరుగుతోంది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈ నెలాఖరుకు ముగుస్తాయి. కేంద్రం ఏపీ విషయంలో చేసే మేలును గురించి స్పష్టమైన వివరణతో పాటు కాలపరిమితిని నిర్ణయించాలని టీడీపీ డిమాండ్ చేస్తోంది. పోరాటంలో వెనక్కు తగ్గవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు తన పార్టీ ఎంపీలకు చెప్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే బీజేపీతో టీడీపీ కటీఫ్ అవుతుంది. అదే జరిగితే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో బీజేపీ ప్రతిపక్షంగా వ్యవహరిస్తుంది. ఏమి జరుగుతుందో అసెంబ్లీ సమావేశాల నాటికి క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

# రచయితకు సామాజిక బాధ్యత ఎంతో అవసరం

**గుంటూరు కార్పొరేషన్ :** రచయితకి సామాజిక బాధ్యత ఎంతో అవసరమని జాగృతి సంపాదకులు, ఏకలవ్య ఫౌండేషన్ చైర్మన్ పి. వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక చంద్రమౌళి నగర్‌లో ఉన్న మౌర్య ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో 'యుగ భారత్-రచయితల సమ్మేళనం' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ పాత్రికేయులు దుగ్గరాజు శ్రీనివాసరావు అధ్యక్షతన వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పి. సంస్కరం విశాల మనస్తత్వం, సమాజంలో మార్పు వస్తుందో దాన్ని రచయిత వివరించగలగాలన్నారు. సమస్యని ఎలా తొలగించాలో ఆలోచించి అలాంటి ఆలోచన అనుభూతిని పాఠకుడిగా ఇస్తేనే అది మంచి రచన అవుతుందని చెప్పారు. సృష్టిలో అన్ని జీవరాసులతోపాటు తన ఒక భాగమనే దృక్పథంతో మెలగాలన్నారు. ప్రపంచంలో ఎక్కడ జ్ఞానం ఉంటే దాన్ని అనుసరించాలి అనేది ఏ దేశమైనా చెప్పే మాటని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఆత్మ విశ్వాసంతో సమాజంలో మనిషిగా ముందుకు పోవాలని సూచించారు. దుగ్గరాజు శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజంలో దుర్మార్గుడైన వారిని చివరిలో హత్య చేయటమే పరిష్కారం అని సినిమా కథల్లో ముగింపు నిస్తున్నారని కాని తప్పు చేసిన వారిని సంస్కరించి సరియైన మార్గంలో తీసుకువచ్చే పద్ధతి గల రచనలు రావాలన్నారు.యుగ భారత్ సంపాదకులు కె. కోటేశ్వరరావు మాట్లాడుతూ సమాజాన్ని సక్రమంగా, సరియైన మార్గంలోకి తీసుకెళ్ళేలా రచన చేసే రచయితలకు వారి గురుతర భాద్యత అని గుర్తు చేశారు. వారి నుంచి సూచనలు కూడా స్వీకరించాలన్న ఉద్దేశ్యంతో ఈ రచయితల సమ్మేళనసమావేశములను ఏర్పాటు చేశామన్నారు.

## అయోధ్య అంశం 'అచ్చమైన భూవివాదం'

**సుప్రీంకోర్టు స్పష్టీకరణ మార్చి 14కు కేసు వాయిదా**

**న్యూఢిల్లీ :** బాబ్రీ మసీదు- రామ జన్మభూమి అంశాన్ని ఒక 'అచ్చమైన భూవివాదంగా' గా వ్యవహరించనున్నట్లు సుప్రీంకోర్టు స్పష్టీకరించింది. ఈ కేసును విచారించింది. ఈ సమయంలో కొత్తగా పిటిషన్లను స్వీకరించేది లేదని స్పష్టం చేసింది. ఈ కేసులోని పార్టీలు తమ తమ పత్రాలను ఆంగ్లంలోకి అనువదించి సమర్పించాలని ఆదేశించింది. తదుపరి విచారణ వచ్చే నెల 14న జరుగుతుందని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ప్రత్యేక ధర్మాసనం తెలిపింది. రోజువారీ విచారణ జరపాలనే ఉద్దేశం ధర్మాసనానికి లేదని పేర్కొంది. ఈ ప్రత్యేక ధర్మాసనంలో సీజేఐ జస్టిస్ దీపక్ మిశ్రాతోపాటు న్యాయమూర్తులు అశోక్ భూషణ్, ఎస్.ఎ. నజీర్ ఉన్నారు. ఈ వివాదంలో అలహాబాద్ హైకోర్టులో పార్టీలు కానివారి పిటిషన్లను తర్వాత పరిశీలిస్తామని ధర్మాసనం చెప్పింది. గురువారం నాటి నుంచి రెండు వారాల్లోగా ఈ కేసుకు సంబంధించిన పుస్తకాల సారాంశాన్ని, ఆంగ్ల అనువాదాలను సమర్పించాలని, హైకోర్టు రికార్డుల్లో ఉన్న వీడియో క్యాసెట్ల కాపీలను కూడా సమర్పించాలని రిజిస్ట్రీని ఆదేశించింది. నాలుగు సివిల్ దావాలపై అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై 14 అపీళ్లను సుప్రీంకోర్టు ప్రత్యేక ధర్మాసనం విచారిస్తున్న సంగతి తెలిసిందే దాఖలైన నాలుగు సివిల్ దావాలపై హైకోర్టు తీర్పుపై దాఖలైన మొత్తం 14 అప్పీళ్లను సుప్రీంకోర్టు విచారిస్తుంది. సార్వత్రిక ఎన్నికల తర్వాత 2018, జూలైలో సున్నిత అంశమైన రామ జన్మభూమి- బాబ్రీ మసీదు వివాదంలో అప్పీళ్లను విచారించాలని సున్నీ వక్ఫ్ బోర్డు చేసిన అభ్యర్థనను సుప్రీంకోర్టు గత ఏడాది డిసెంబరులో తిరస్కరించింది.

# చంద్రుడిపై ఇస్రో రోవర్

- మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు రెడీ
- ఏప్రిల్‌లో ప్రయోగానికి సన్నాహాలు : ఇస్రో చైర్మన్ శివన్

**బెంగళూరు :** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో). అంతరిక్ష పరిశోధనలో ఇది ఇప్పటికే ఎన్నో మైలురాళ్లను అందుకున్నది. తాజాగా మరో చారిత్రాత్మక ప్రాజెక్ట్‌ను సిద్ధం చేస్తున్నది. భారత్ తరపున తొలిసారి ఓ రోవర్‌ను చంద్రుడిపైకి పంపే ప్రతిష్టాత్మక చంద్రయాన్-2 మిషన్‌ను ఈ ఏడాది ఏప్రిల్‌లో చేపట్టడానికి సన్నాహాలు చేస్తోంది. చంద్రుడిపై ఇస్రో పరిశోధనలు చేయడం ఇది తొలిసారి కాదు. 2008లోనూ శ్రీహరికోట నుంచి ప్రయోగించిన చంద్రయాన్ -1ను చంద్రుని కక్ష్యలో విజయవంతంగా ఉంచగలిగింది. ఇది చంద్రునిపై నీటి జాడను కనుకొన్నది. ఇప్పుడు లాంచ్ చేయబోయే చంద్రయాన్-2ను చంద్రునిపై దించాలని ఇస్రో సంకల్పించింది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను ఇస్రో చైర్మన్ కె.శివన్ వెల్లడించారు. ఇప్పటికే చంద్రునిపై రోవర్‌ను దించడానికి రెండు ప్రదేశాలను పరిశీలించామని, గతంలో ఏ రోవర్ దిగని ప్రదేశంలో చంద్రయాన్-2ను దింపబోతున్నామని ఆయన తెలిపారు. ఏప్రిల్‌లో శ్రీహరికోట నుంచి చంద్రయాన్-2ను ప్రయోగించనున్నామని, అక్కడి నుంచి చంద్రుని కక్ష్యలోకి అది చేరడానికి ఒకటి నుంచి రెండు నెలల సమయం పడుతుందని శివన్ తెలిపారు.

## నాసా టూర్‌కు బాలకుటీర్ విద్యార్థి

**రాజధాని ప్రతినిధి, గుంటూరు (నల్లచెరువు) :** కల్పనా చావ్లా నేషనల్ స్కాలర్ 2017కు శ్రీ వెంకటేశ్వర బాలకుటీర్‌కు చెందిన విద్యార్థి ఇనుకొల్లు నవీన్ కౌశిక్ రెడ్డి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సుధామాధవి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల వార్షికోత్సవంలో కౌశిక్‌ను వ్యవస్థాపకురాలు డాక్టర్ మంగా దేవి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కల్పనాచావ్లా నేషనల్ స్కాలర్ వారు ఈ ఏడాది నాసా టూర్ నిర్వహిస్తున్నారన్నారు. ఈ టూర్‌కు దేశ వ్యాప్తంగా విజ్ఞాన రంగంలో ఆసక్తి ఉన్న 20 మందిని తీసుకువెళ్లాలని నిర్ణయించారన్నారు. ఇందులో భాగంగా నిర్వహించిన పరీక్షలో కౌశిక్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి టూర్‌కు ఎంపికయ్యాడన్నారు.

## రాష్ట్రం కోసం గళం విప్పండి : రఘువీరారెడ్డి



**రాజధాని ప్రతినిధి,పెనుకొండ :** రాష్ట్ర పరిరక్షణ కోసం అన్ని రాజకీయ పార్టీలు గళం విప్పాలని పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి కోరారు. కాంగ్రెస్ పార్టీ ఆంధ్ర రాష్ట్రాన్ని విడగొట్టిందని అపవాదు మోపిన టీడీపీ బీజేపీతో జతకట్టి, ప్రజలకు మోసపూరిత వాగ్దానా లిచ్చి ఎన్నికల్లో ఓట్లు వేయించుకుందని విమర్శిస్తూ రాష్ట్రానికి ఏ కార్యాన్ని సాధించలేదని మండిపడ్డారు. పట్టణంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసిన రాష్ట్రం విడిపోయినప్పుడు చట్టంలో చేసిన అంశాలను కూడా అమలు చేయ లేదని, మోడీ అంటే భయం వీడాలని, పోరాడితే రాష్ట్రానికి మేలు చేసిన వారు అవుతారన్నారు. 5 నుంచి 15 వరకు అన్ని మండల కేంద్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి విన్నపాలు ఇస్తామని, 8న రాష్ట్ర బంద్‌కు పిలుపు నిచ్చామని, ఇందుకు సీపీఎం, సీపీఐ కూడా మద్దతు తెలిపాయన్నారు.

## ట్రిపుల్ తలాక్ బిల్లు తప్పులతడక

**దోషాలు సవరణకు కృషిచేస్తాం : ఆలిండియా ముస్లింలా బోర్డు**

**హైదరాబాద్ :** మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రతిపాదించిన ట్రిపుల్ తలాక్ బిల్లు తప్పులతడకని, అందులోని దోషాలను సవరించే దిశగా చర్యలు తీసుకుంటీమని ఆలిండియా ముస్లిం పర్సనల్‌లా బోర్డు (ఏఐఎంపీఎల్‌బీ) పేర్కొంది. తప్పులభరిత బిల్లును అమలు చేసేందుకు బీజేపీ యత్నిస్తోందని ఆరోపించింది. 'యావత్ ప్రపంచంలోనే ఇలాంటి చట్టం ఎక్కాడా లేదు.. తప్పులభరితమైన ఈ బిల్లును ఆమోదింపజేసేందుకు యత్నిస్తున్నారు. ఇందులోని తప్పులన్నింటినీ సవరించేంత వరకు ముస్లిం లా బోర్డు విరమించదు' అని బోర్డు అధికార ప్రతినిధి మౌలానా ఖలీల్ ఉర్ రెహమాన్ సజ్జద్ నౌమానీ అన్నారు. హైదరాబాద్‌లో మూడ్రోజుల పాటు నిర్వహించే బోర్డు 26వ వార్షిక సదస్సు సందర్భంగా ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. లా బోర్డు ట్రిపుల్ తలాక్ బిల్లును వ్యతిరేకించడం లేదని స్పష్టంచేశారు. దానిలో తప్పులను సవరించాల్సిందిగా కోరుతోందని తెలిపారు. ఈ నేపథ్యంలో దీన్ని ఆమోదించాలా లేదా అన్నది పరిశీలించాలని ఆయన విపక్షాలను కోరారు. ఈ బిల్లు తలాక్ విధానాన్నే నిషేధించే విధంగా ఉందని నౌమానీ తెలిపారు. 'ట్రిపుల్ తలాక్ విధానాన్ని పూర్తిగా నిషేధించే విధంగా దీన్ని రూపొందించారు. అంతేకాకుండా, ఎవ్వరైనా సరే విడాకుల నెపంతో ముస్లింలపై ఫిర్యాదు చేసే విధంగా తయారుచేశారు' అంటూ ఆయన తెలిపారు. వార్షిక సదస్సులో ట్రిపుల్ తలాక్, అయోధ్య వ్యవహారాలలో భవిష్యత్ కార్యాచరణను ఇప్పటికే లోక్‌సభ ఆమోదించగా రాజ్యసభ ఆమోదించాల్సి ఉంది.

# దుర్గగుడిలో ఈ గవర్నెన్స్

**పాలక వర్గం సమావేశంలో నాలుగు తీర్మానాలు ఆమోదం**

**రాజధాని ప్రతినిధి, అమరావతి :** దుర్గగుడిలో ఈ గవర్నెన్స్ అమలు చేసేందుకు పాలకవర్గ సభ్యులు ఆమోదం తెలిపారు. విజయవాడ జమ్మిదొడ్డి కార్యాలయంలో జరిగిన దుర్గగుడి పాలకవర్గం సమావేశంలో పలు అంశాలను ఆమోదించారు. దేవస్థానం వైదిక కమిటీ సలహా మేరకు స్వామి వారి ఆలయానికి కళ్యాణ కార్యక్రమం, ఆర్జిత సేవలకు ప్రదేశం మార్పులు తదితర వాటికి ఆమోదం లభించింది. అన్నప్రాసన, అక్షరాభ్యాసం, నామకరణ వంటి కార్యక్రమాలను అన్నదానం పాత క్యాంప్లెక్స్ ప్రాంతంలో జరిపేలా ఆమోదించారు. సమావేశం అనంతరం ఆలయ ఈవో ఎం. పద్మ విలేకరులతో మాట్లాడుతూ టికెట్ల ధర తగ్గింపు అంశం పరిశీలనలో ఉందన్నారు. పాలకవర్గ సమావేశంలో ఏడు అంశాలకు నాలుగింటిని ఆమోదించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గౌరంగబాబు, సభ్యులు బడేటి ధర్మారావు, పద్మాశేఖర్‌రావు, కోడేల సూర్యలతాదేవి, సాంబ సుశీలాదేవి, బీరక ప్రసాద్, ఇట్టా పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## మెరిట్‌కే ప్రాధాన్యం ఇవ్వండి

- దేశాలకు ప్రత్యేక కోటా వద్దు
- వైట్‌హౌస్ వద్ద తానా, ఆర్‌హెచ్‌సీ ర్యాలీ

**రాజధాని ప్రతినిధి, అమరావతి :** అమెరికా వలస విధానంలో ప్రతిభకే ప్రాధాన్యం ఇవ్వాలని మనదేశానికి చెందిన తానా, రిపబ్లికన్ హిందూ కూటమి (ఆర్‌హెచ్‌సీ) కోరాయి. మెరిట్‌తో సంబంధం లేకుండా దేశాలకు ప్రత్యేక కోటా పెట్టడం వల్ల ప్రతిభగల వారికి అన్యాయం జరుగుతోందని నినదించాయి. దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన మెరిట్ ఆధారిత వలస విధానానికి మద్దతుగా వాషింగ్టన్ డీసీలోని వైట్‌హౌస్ వద్ద ఈ రెండు సంస్థలు ర్యాలీ చేపట్టాయి. సుమారు వెయ్యి మంది భారతీయులు ర్యాలీలో పాల్గొన్నారు. వైట్ హౌస్ ఎదుట భారతీయులు ర్యాలీ చేయడం ఇదే మొదటిసారి. హెచ్1బీ వీసా కలిగిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, టెక్నికల్ ఉద్యోగులు కూడా ఇందులో పాల్గొన్నారు. గ్రీన్ కార్డులకు దరఖాస్తుల ప్రక్రియను నిలిపివేయడం వల్ల తమ కుటుంబాలు చాలా ఇబ్బందులు పడుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. అమెరికాలో ఇమ్మిగ్రేషన్ ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ పిల్లలు ఇక్కడికి రావాలని కోరుకోలేదని, కానీ వారికి ఇక్కడ మంచి జీవితం ఇవ్వాలని తాము ప్రయత్నిస్తున్నామని చెప్పారు. గ్రీన్ కార్డుల జారీలో జాప్యం వల్ల పిల్లల చదువులకు ఇబ్బందిగా మారిందన్నారు. గ్రీన్ కార్డు కోసం ఏడెనిమిదేళ్ల కిందట దరఖాస్తు చేసుకున్నా ఇంకా ప్రాసెస్‌లోనే ఉందన్నారు. ప్రతిభ ఉన్న యువత గ్రీన్‌కార్డుల కోసం ఎదురుచూస్తున్నారని, వారికి న్యాయం చేయాలని కోరారు. ర్యాలీలో యాష్ బొడ్డులూరి, రామ్‌చౌదరి ఉప్పుటూరి, సతీష్ వేమన తదితరులు పాల్గొన్నారు.

## కేసీపీ కంపెనీ లీజు గడువు పొడిగింపు


**రాజధాని ప్రతినిధి- అమరావతి :** కేసీపీ లిమిటెడ్‌కు సున్నపురాయి తవ్వకాలకు సంబంధించి లీజు గడువును మరో 50 సంవత్సరాలకు ప్రభుత్వం పొడిగించింది. ఈమేరకు పరిశ్రమలు, వాణిజ్యశాఖ కార్యదర్శి బి శ్రీధర్ జీవోను జారీ చేశారు. కృష్ణాజిల్లా జగ్గయ్యపేట మండలం ముక్త్యేశ్వర పురంలోని 368.35 హెక్టార్లలో ఉన్న సున్నపురాయి గనులను కేసీపీ లిమిటెడ్‌కు 30 ఏళ్లపాటు లీజుకు ఇచ్చారు. ఈ గడువు 2002 ఫిబ్రవరి 21వ తేదీతో ముగిసింది. ఈ గడువు 50 ఏళ్లపాటు పొడిగించాలాని గనులశాఖ నిర్ణయించింది. దీంతో ఈ సంస్థ 2050 ఫిబ్రవరి 20 వరకూ సున్నపురాయిని తవ్వుకునేందుకు అనుమతి మంజూరు చేస్తున్నట్లు జీవోలో పేర్కొన్నారు.

## ఆర్‌జీయూకేటీలకు రూ. 50కోట్ల బడ్జెట్

**అమరావతి :** రాష్ట్రంలోని రాజీవ్‌గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జీ టెక్నాలజీస్ (ఆర్‌జేయూకేటీ)లకు 2017-2018 విద్యాసంవత్సరానికిగాను రూ. 50కోట్ల బడ్జెట్టును రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఈ మేరుకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆదిత్యనాథ్‌దాస్ ఉత్తర్వులు జారీ చేశారు. నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళంలోని ట్రిపుల్ ఐటీల నిర్వహణ కోసం నిధులను వినియోగిస్తారు. ఏపీ టెక్నికల్ ఎడ్యుకేషన్ చీఫ్ సెక్రటరీ చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

# మార్చి 31 లోగా ఓడిఎఫ్ లక్ష్యాలు పూర్తి : సీఎం

**రాజధాని ప్రతినిధి-అమరావతి :** ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చి 31 లోగా ఏపీ సంపూర్ణ ఓడిఎఫ్ రాష్ట్రం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. సచివాలయంలో ఆయన సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చే వినతులు, ఈ- పరిపాలన స్వచ్ఛాంధ్ర ప్రదేశ్‌లో భాగంగా ఓడిఎఫ్ పై సమీక్షను, జిల్లా కలెక్టర్లతో వీడియో కానారేన్స్ నిర్వహించారు. దేశంలో మన రాష్ట్రం ఇప్పటికి 83.90 శాతం ఓడిఎఫ్ సాధించిందని, విగిలిన లక్ష్యాన్ని మార్చి నెలాఖరుకు పూర్తిచేయాలని ఆదేశించారు. ఓడిఎఫ్‌లో అరుణాచల్ ప్రదేశ్, చత్తీశ్‌గఢ్ దయ్యు డామన్‌లు అగ్రస్థానంలో ఉన్నాయని, మహారాష్ట్ర 19 శాతంతో చివరిస్థానంలో ఉందని వివరించారు. ఓడిఎఫ్ కు శ్రీకాకుళం, చిత్తూరు, అనంతపురం విశాఖ జిల్లాలలోనే సమస్య ఉందని కేంద్ర ప్రభుత్వ 'స్వచ్ఛ భారత్' మిషన్ అధికారులు సీఎంకి వివరించారు. వచ్చే రెండు నెలలు



పరీక్షలు ఉన్నట్లుగానే భావించి పనిచేయాలని కలెక్టర్లను సీఎం కోరారు. ఆర్థిక సమస్యలను అధిగమించడానికి ఈ పర్యాయం అన్ని ప్రభుత్వ శాఖలను ఒక దగ్గర చేర్చి కన్వర్జెన్స్ ద్వారా నిధులను కేటయిస్తామని ముఖ్యమంత్రి వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ' ప్రజలే ముందు' అనే నినాదంతో ప్రవేశపెట్టిన ప్రతిషాత్మక 1100 నెంబర్ పరిష్కార వేదిక లాంటిది దేశంలోనే వినూత్నమైనదని, విజయవంతం చేయాలని సీఎం పిలుపునిచ్చారు. ప్రజల్లో పరిపాలనపై, ప్రభుత్వ పథకాల అమలుపై సంతృప్తిని తీసుకురావడంలో ప్రజలే ముందు' పరిష్కార వేదిక ప్రధాన పాత్ర పోషించాలని, ఇందుకు జిల్లా కలెక్టర్లు సహకారించాలని విజ్ఞప్తి చేశారు. ఐదో విడత జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో వచ్చిన ఆర్థికేతర సమస్యలను నెలరోజుల లోగా పరిష్కరించాలని, ఆర్థిక సమస్యలైతే వీలయినంత త్వరలో పరిష్కరించాలని, ముఖ్యమంత్రి కోరారు. కార్యాలయాల్లో ప్రతి 4వ శనివారం మధ్యాహ్నం ఓడిఎఫ్ సాధనపై మాట్లాడాలన్నారు. మంత్రులు కళావెంకట్రావు, శిద్ధారాఘవరావు, దేవినేని ఉమహేశ్వరావు, నక్కా ఆనందబాబు, అఖిల ప్రియ, కాల్వ శ్రీనివాసులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్, ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అని జిల్లాల కలెక్టర్లు వీడియా కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

# జీఎస్టీ ఎగవేతలు 6 కోట్లు!

**న్యూఢిల్లీ :** ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేవలం ఐదు నెలల వ్యవధిలోనే 16 కేసుల్లో దాదాపు రూ. 6 కోట్ల జీఎస్టీ (వస్తు, సేవల పన్ను) ఎగవేతలు జరిగాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. దేశవ్యాప్తంగా ఒకే విధమైన పన్నుల వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం స్థానిక పన్నులు, ఎక్సైజ్, సేవా పన్నులు సహాడజనుకు పైగా పన్నులను ఒకే గొడుగు కిందికి తీసుకొచ్చి గత ఏడాది జూలై 1వ తేదీ నుంచి జీఎస్టీని అమల్లోకి తెచ్చిన విషయం విదితమే. అయితే 2017 జూలై నుంచి నవంబర్ మధ్య 16 కేసుల్లో రూ. 5.70 కోట్ల జీఎస్టీ ఎగవేతలు జరిగినట్లు కేంద్ర ఆర్థిక శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయని కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి పీపీచౌదరి రాజ్యసభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. అలాగే 2017 ఏప్రిల్-




డిసెంబర్ మధ్య మొత్తం 2,938 కేసుల్లో రూ. 9,660 కోట్ల సేవా పన్ను ఎగవేతలు, 614 కేసుల్లో రూ. 7,242 కోట్ల సెంట్రల్ ఎక్సైజ్ పన్ను ఎగవేతలు, 26,969 కేసుల్లో రూ. 3,987 కోట్ల కస్టమ్స్ సుంకం ఎగవేతలు జరిగినట్లు ప్రభుత్వం గుర్తించిందని ఆయన వెల్లడిస్తూ.. పన్ను ఎగవేతదారులపై సంబంధిత విభాగం తగిన చర్యలు చేపడుతుందని చెప్పారు.

**884 కంపెనీలపై దర్యాప్తు**

ఇదిలావుంటే, మనీ లాండరింగ్‌కు సంబంధించిన వేర్వేరు కేసుల్లో దాదాపు 884 కంపెనీలపై అధికారులు దర్యాప్తు జరుపుతున్నారని, మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) చట్టం కింద చేపట్టిన దర్యాప్తులో భాగంగా రూ. 5,066 కోట్లకు పైగా విలువైన ఆస్తులను జప్తు చేయడం జరిగిందని చౌదరి వెల్లడించారు. అయితే మనీ లాండరింగ్ అభియోగాలతో ఇప్పటివరకూ దేశంలో ఒక్క కంపెనీ రిజిస్ట్రేషన్‌ను కూడా రద్దు (డీరిజిస్టర్) చేయలేదని ఆయన రాజ్యసభకు తెలిపారు.

వెబ్‌డిజైన్ కొరకు సంప్రదించండి
ఫోన్ : 9440662699

## రైఫిల్ షూటింగ్‌లో ఏపీ పోలీసులకు పతకాల పంట

### ఆక్టోపస్ పీసీకి గోల్డ్, రజత పతకాలు

**రాజధాని ప్రతినిధి, అమరావతి :** మధ్యప్రదేశ్‌లోని ఇండర్‌లో జరిగిన అఖిల భారత పోలీసు షూటింగ్ (స్పోర్ట్స్) చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర పోలీసులు పతకాల పంట పండించారు. గత నెల 29వ తేదీ నుంచి ఈ నెల రెండో తేదీ వరకు బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీసు ఫోర్స్ (సీఏపీఎఫ్)ల మధ్య ఈ పోటీలు జరిగాయి. రాష్ట్ర జట్టుకు ఒక బంగారు, ఒక రజత, కాంస్య పతకం లభించాయి. 50 మీటర్ల వ్యక్తిగత ఫ్రీ రైఫిల్ ప్రోన్ షూటింగ్‌లో అక్టోపస్‌కు చెందిన కానిస్టేబుల్ ఎం కృష్ణా (పీసీ 1770) బంగారు పతకాన్ని సాధించారు. అలాగే 300 మీటర్ల వ్యక్తిగత బీగ్ బోర్ ఫ్రీ రైఫిల్ ప్రోన్‌లో రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. 300 మీటర్ల ఫ్రీ రైఫిల్ షూటింగ్‌లో టీం ఈవెంట్‌లో గ్రేహౌండ్స్‌కు చెందిన పీవి. రవీంద్ర, ఆక్టోపస్‌కు చెందిన వై భరత్‌కుమార్,కృష్ణా జట్టు కాంస్య పతకాన్ని సాధించింది. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా మంగళగిరిలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో జరిగిన కార్యక్రమంలో డీజీపీ డాక్టర్ ఎం మాలకొండయ్య పతక విజేతలను ఘనంగా సత్కరించారు.రైఫిల్ షూటింగ్‌లో పతకాలు సాధించటం వల్ల మరోసారి జాతీయస్థాయిలో రాష్ట్ర ప్రతిష్ట మరోసారి పెరిగిందన్నారు. రిబెటాలియన్స్ ఐజీ రాజీవ్ కుమార్ మీనా పతక విజేతలను అభినందించి తగిన ప్రోత్సాహం కోసం డీజీపీకి సిఫార్సు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీజీపీ (శాంతి భద్రతలు) హరీష్‌కుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడ నుంచి 3 నగరాలకు ఇండిగో సర్వీసులు

**రాజధాని ప్రతినిధి, అమరావతి :** విజయవాడ నుంచి మూడు నగరాలకు సర్వీసులను ప్రారంభిస్తున్నట్లు ఇండిగో ఎయిర్‌లెన్స్ ప్రకటించింది. మార్చి 2వ తేదీ నుంచి ఈ సేవలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఇండిగో ఎయిర్‌లెన్స్ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ సంజయ్ కుమార్ తెలిపారు. విజయవాడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. విజయవాడ నుంచి హైదరాబాద్‌కు ప్రతి రోజు మూడు సర్వీసులు, బెంగళూరు, చెన్నైలకు ఒక్కో సర్వీసు చొప్పున రోజుకు 5 సర్వీసులను నడపనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌కు రూ. 1,246, చెన్నై రూ. 1,179, బెంగళూరుకు రూ. 1,826 నుంచి అందుబాటులో ఉంటాయన్నారు. వచ్చే 2,3 నెలల్లో ముంబై, ఢీల్లీలకు నేరుగా సర్వీసులను ప్రారంభిఎయిర్‌లెన్స్ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ సంజయ్ కుమార్ తెలిపారు. ఉడాన్ పథకం కింద తిరుపతి నుంచి కొల్హాపూర్, కేరళలోని కానూర్‌లకు త్వరలో విమాన సర్వీసులను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

## కాలమ్

**ఒకడికి రాష్ట్ర పరిస్థితి చూసి చాలా బాధేసి ఎలాగైన పరిస్థితులను చక్కబరచాలి అనుకుని అది ఆ దేవుడి వల్లే సాధ్యం అని దరగ్గరలోని చిట్టడివికి వెళ్లి తపస్సు చేయాలని నిర్ణయించుకున్నాడు.**

అడవికి వెళ్లి ఘోరంగా తపస్సు చేయడం మొదలుపెట్టాడు..
అంతఘోరం చూడలేక దేవుడు ప్రత్యక్షమై ఇలా అన్నాడు.
దేవుడు : నీ ఘోర మైన తపస్సు నాకు నచ్చింది. ఏం కావాలి ?? కోరుకో
**ఘోర తపస్వీ :** స్వామి రాష్ట్రంలో ఉన్న సమస్యలన్నీ చక్కబరచాలి..
**దేవుడు :** చూడు ఘోర తపస్వీ... అన్నీ అంటే నా వల్ల కాదు కాని ఒక మూడు ప్రధాన సమస్యలు చెప్పు సాల్వ్ చేస్తాను..
అనేసరికి మనోడికి అనుమానం వచ్చింది..
కొంతకాలం నుంచి తపస్సులో ఉన్నా కదా అసలు ఇప్పుడు రాష్ట్రంలో ప్రధాన సమస్యలు ఎమున్నాయో తెలీక కాసేపు ఆలోచించి..
"వన్ మినిట్ స్వామి' అనేసి పరుగెత్తుకుని ఆ ఆడవి బయట ఉన్న ఒక కాకా హోటల్‌కి వెళ్ళాడు..
అక్కడ కొంత మంది రాష్ట్ర ప్రజలు ఉంటే వారిని అడిగాడు "ఇప్పుడు మన రాష్ట్రం లో ఉన్న మూడు ప్రధాన సమస్యలు ఏంటి" అని. వారు "ఓవర్ యాక్షన్ చెయ్యకు మాకేం తెలుసు ఎద్దైన న్యూస్ చానల్ పెట్టుకుని చూడు తెలుస్తుంది" అని అక్కడున్న టి.వి. వైపు చూశారు..
ఘోర తపస్వీ కాసేపు అన్ని న్యూస్ చానల్స్ చూసి "సరి అని తల అడ్డంగా ఊపి తిరిగి దేవుడి దగ్గరకు వచ్చి గర్వంగా నిల్చున్నాడు..
**దేవుడు :** చెప్పు మీ రాష్ట్రంలోని ప్రధాన సమస్యలు..
**ఘోర తపస్వీ :** స్వామి మూడు సమస్యలున్నాయి.
1. ఎవడో ఒకడు.. కథనాయకుడిని విమర్శిస్తున్నాడు స్వామి..
2. యాంకర్ తాగి రోడ్ మీద అడ్డంగా దొరికి పోయాడంట స్వామి..
3. ఒక కళాకారుడు రాసలీలలతో నిలువునా దొరికి పోయాడంట స్వామి...

అని ఘోర తపస్వీ గర్వంగా ఆన్సర్ చెప్పాడు..
దాంతో దేవుడికి బాగా కోపం వచ్చి దుడ్డు కర్ర తీసుకుని
అడవి అంతా తిప్పి తిప్పి కొట్టాడు..
ఇక పరిగెత్తే ఓపిక లేక ఘోర తపస్వీ ఆగి
**ఘోర తపస్వీ :** ఎందుకు కొడుతున్నావ్ స్వామి... చెప్పి కొట్టు..
**దేవుడు :** ఒరేయ్ దౌర్భాగ్యుడా... రాష్ట్రంలో ప్రధాన సమస్యలు చెప్పరా అంటే... ఎంట్రా నువ్వు చెప్పేది..
**ఘోర తపస్వీ :** నాకేం తెలుసు టి.విలో మొత్తం అదే హెడ్ లైన్స్, అవే డిబేట్స్, అవే స్క్రోలింగ్స్..
**దేవుడు :** అదేరా మీతో ప్రాబ్లం అసలైన విషయాలన్నీ వదిలేసి పనికిమాలిన విషయాల గురించి పాకులాడుతారు..
ఏరా మీకంత తెలివితేటలు ఇచ్చి టి.వి. తయారుచేయిస్తే..
ఆత్మ హత్యలు చేసుకుంటున్న అన్నం పెట్టే రైతుల గురించి వదిలేసి..
అక్రమంగా పాలన సాగిస్తున్న నాయకుల గురించి వదిలేసి..
అన్నెం పున్నెం ఎరుగని పిల్లలకి కిలోల్లెక్క స్కూల్ బ్యాగ్ తగిలించి వాళ్ళ ఏడ్చి ఏడ్చి ఆత్మహత్యలు చేసుకుంటుంటే అది వదిలేసి.. బోర్డర్ లో కొన్ని వేల మంది సైనికులు దేశం కోసం చస్తుంటే అది వదిలేసి..
తినడానికి అన్నం లేక ఎంతో మంది అనాథలు ఉంటే వాల్లని వదిలేసి..ఇలాంటి ముఖ్యమైన సమస్యలు వదిలేసి..
చెత్త చెదారాన్ని ప్రధాన సమస్యలని టి.విలో చూస్తూ వాటి గురించే డిస్కస్ చేసుకుంటూ పోస్టు పెట్టుకుంటూ టిఆర్ రెటింగ్ కోసం రోజూ రోజుకు దిగా జారిపోతున్న ఛానెల్స్, రేటింగులు, వచ్చే లైక్లు చూసి కడుపు నింపుకునే మిమ్మల్ని బాగు చేయాలంటే నా వల్ల కాదు గాని ఏ దేవుడి వల్ల కూడా కాదు దరిద్రుడా..
అని మాయం అయిపోయాడు..
**ఘోర తపస్వీ కి మాత్రం కోపం వచ్చి**
**ఎఫ్.బి. లో ఇలా పోస్ట్ పెట్టాడు..**
**"దేవుడు అనేది వట్టి భూటకం.. అతను ఏమీ చేయలేడు..."**
**అని పోస్ట్ పెట్టాడు.**
**సరే దాని మీద ఫుల్ డిబేట్.. టీవీల్లో....**
**ఘోర తపస్వీ ఘోరంగా ఖుషి...**


# రాజధాని క్లాసిఫైడ్స్

వాణిజ్య, క్లాసిఫైడ్ ప్రకటనలకు సంప్రదించండి
9440662699

**నివాస ప్లాట్లు**

నవులూరు
రాజధాని ప్రాంతంలోని నవులూరు గ్రామ పరిధిలో 500, 1000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ :9440662699

రాయపూడి
రాజధాని ప్రాంతంలోని రాయపూడి గ్రామ పరిధిలో 500, 1000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9908244333

నీరుకొండ
రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్: 9440662699

**రెంటల్స్**

రాయపూడి
రాజధాని ప్రాంతం రాయపూడిలో 250 గజముల ఖాళీ స్థలము అద్దెకు కలదు
ఫోన్ : 9440662699

రాయపూడి
రాజధాని ప్రాంతం రాయపూడి గ్రామంలో కొత్తగా నిర్మించిన భవనం నందు 2 బెడ్‌రూమ్ అద్దెకు కలదు
ఫోన్ :9951915347

విజయవాడ
విజయవాడలో బస్‌స్టాప్‌కు దగ్గరలో, పార్కింగ్ వసతిగల 2 బెడ్‌రూమ్ ఇల్లు అద్దెకు కావలెను
ఫోన్ : 9440662699

మల్కాపురం
స్వాగత్ మెస్ ప్యూర్‌వెజ్
ఫోన్ : 90329 58580

**ఇతరములు**

తుళ్ళూరు
ఎస్.ఎమ్(స్టైల్ ఫర్ మెన్) ట్రైలర్స్
ఫోన్ 9440307123

పి.యల్.సి.బి డెవలపర్స్
అమరావతి రాజధాని ప్రాంతంలో ఇళ్ల స్థలములు కావలసిన వారు సంప్రదించండి
ఫోన్ : 9676844442

విజయవాడ
విజయవాడలో బస్‌స్టాప్‌కు దగ్గరలో, పార్కింగ్ వసతిగల 1 బెడ్‌రూమ్ ఇల్లు అద్దెకు కావలెను
ఫోన్ : 9440662699

మందడం
ఎస్.ఆర్.కె. గ్రాండ్ రెస్టారెంట్
ఫోన్ : 9553023388

వెలగపూడి
సాయి గణేష్ ట్రేడర్స్: నిర్మాణ రంగానికిసిమెంట్, స్టీలు, పైపులు, పెయింట్‌లు అమ్మబడును.
ఫోన్ : 9640811333

రాయపూడి
చంద్రిక ట్రేడర్స్ నిర్మాణ రంగానికి సిమెంట్, స్టీలు,పైపులు అమ్మబడును.
ఫోన్ : 9908073516

రాయపూడి
రియల్‌ఎస్టేట్ క్రయ,విక్రయాలకు సంప్రదించడం న్యూసింగపూర్ రియల్ ఎస్టేట్
ఫోన్ : 9848442436

రాయపూడి
కాకతీయ ఫుడ్ కోర్ట్
ఫోన్ 9848021898

**వాణిజ్య ప్లాట్లు**

నవులూరు
రాజధాని ప్రాంతంలోని నవులూరు గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9440662699

ఐనవోలు
రాజధాని ప్రాంతంలోని ఐనవోలు గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9908244333

నీరుకొండ
రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9440662699

**రెంటల్స్**

విజయవాడ
విజయవాడలో బస్‌స్టాప్‌కు దగ్గరలో, పార్కింగ్ వసతిగల 2 బెడ్‌రూమ్ ఇల్లు ఆఫీసుకు కావలెను
ఫోన్ : 9440662699

రాయపూడి
రాజధాని ప్రాంతం రాయపూడిలో 250 గజముల ఖాళీ స్థలము అద్దెకు కలదు
ఫోన్ : 9440662699

రాయపూడి
రాజధాని ప్రాంతం రాయపూడి గ్రామంలో కొత్తగా నిర్మించిన భవనం నందు 1 బెడ్‌రూమ్ అద్దెకు కలదు
ఫోన్ :9951915347

రాయపూడి
రాజధాని ప్రాంతం రాయపూడి గ్రామంలో కొత్తగా నిర్మించిన భవనం నందు 2 బెడ్‌రూమ్ అద్దెకు కలదు
ఫోన్ :9951915347

**షాప్స్**

తుళ్ళూరు
రేమాండ్స్‌ట్రైలర్స్
ఫోన్ : 9492470426

రాయపూడి
వర్షిత ఫోటోస్టాట్
ఫోన్ : 9985853188

తుళ్ళూరు
వైభవ్ డ్రస్సెస్
ఫోన్ : 9848407935

తుళ్ళూరు
రాజా గోల్డ్ కవరింగ్
ఫోన్ : 9581500500

తుళ్ళూరు
శ్రీసాయి జ్యూయలరీ వర్క్స్
ఫోన్ :9247171083

రాయపూడి
ఖాజా ఖాదర్ రైస్ స్టోర్స్
ఫోన్ : 9603990791

**హాస్పటల్స్**

విజయవాడ
ఆంధ్ర హాస్పటల్, డా॥శ్రీమన్నారాయణ
ఫోన్ : 9177219900

విజయవాడ
ఇంధిరారావు మెడికేర్ (సెంటర్)
ఫోన్ : 9440421580

విజయవాడ
న్యూఫేస్ క్లినిక్ , డా॥మేహబూబ్
ఫోన్ : 9849122788

విజయవాడ
అష్రఫ్ మెటర్నిటీ & ఇ,ఎన్‌టి డా॥ రెహమాన్
ఫోన్: 0866-2475087

విజయవాడ
శ్రీమానస సైకియాట్రిక్ డా॥ అయోధ్య ఆర్.కె
ఫోన్:0866-2436647


గమనిక : క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు. - మేనేజర్


## పవర్‌ఫుల్ ఉమెన్ అచీవర్‌గా షేక్ నౌహెరా



**హైదరాబాద్ :** ప్రముఖ నెక్స్ బ్రాండ్ తాజాగా పవర్‌ఫుల్ ఉమెన్ అచీవర్ అవార్డును ప్రకటించింది. ఈ అవార్డును హీరా గ్రూప్ సీఈవో డాక్టర్ షేక్ నౌహెరా అందుకున్నారు. డాక్టర్ నౌహెరా తన 19 ఏళ్ల ప్రాయంలో విద్యారంగంలో సేవలను ప్రారంభించింది. తరువాత ఆమె హీరా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ప్రారంభించింది. ఈ గ్రూప్ ద్వారా విద్య బంగారం వ్యాపారం, పెట్టుబడులు, వస్త్ర ఉత్పత్తి, జ్యూవెలరీ, మినరల్ వాటర్, గ్రానైట్ టూర్స్ అండ్ ట్రావెల్స్, రియల్ ఎస్టేట్, ఎలక్ట్రానిక్స్ తదితర వ్యాపారాలను నిర్వహిస్తున్నారు. ఈ గ్రూపులో వేల మంది సభ్యులున్నారు. తన తల్లిదండ్రులు ప్రోత్సహంతోనే ఈ స్థాయికి ఎదిగానని డాక్టర్ నౌహెరా తెలిపారు.

## అగ్ని-1 సక్సెస్



**బాలసోర్ :** స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన స్వల్ప శ్రేణి ఖండాతరక్షిపణి అగ్ని-1ను భారత్ విజయ వంతంగా ప్రయోగించింది. ఒడిశాలోని డా.అబ్దుల్ కలాం ద్వీపం నుంచి క్షిపణిని విజయవతంగా ప్రయోగించినట్లు రక్షణ శాఖ వెల్లడించింది. అణ్వస్త్ర సామర్థ్యం గల ఈ క్షిపణి ఉపరితలం నుంచి ఉపరితలంపై ఉన్న లక్ష్యాలను చేదిస్తుంది. ఇది దాదాపు 700 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను చేరుకోగలదు. అగ్ని-1 సుమారు 12 టన్నుల బరువు, 15 మీటర్ల పొడవు ఉంటుంది. దాదాపు 1000 కేజీల వరకు పేలోడ్స్ మోసుకుపోగలదు. భారత్ సైన్యానికి చెందిన వ్యూహాత్మక దళాల శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఈరోజు క్షిపణి ప్రయోగం చేశారు. ప్రయోగం పూర్తిగా విజయవంతమైందని, క్షిపణి లక్ష్యాలను ఛేదించిందని అధికారులు వెల్లడించారు. దీన్ని ఇప్పటికే భారత సైన్యంలో చేర్చారు.

## ఆధార్ లేని పౌరులకు సామాజిక ప్రయోజనాలు తిరస్కరించొద్దు

### కేంద్రానికి సుప్రీంకోర్టు స్పష్టీకరణ

**న్యూఢిల్లీ :** ఆధార్ కలిగి లేని ఏ వ్యక్తికీ సామాజిక ప్రయోజనాలను నిరాకరించరాదని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. గుర్తింపునకు సంబంధించిన ఇతర రూపాల ఆధారణంగా వారికి సామాజిక ప్రయోజనాలను కొనసాగించాలని పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, న్యాయమూర్తులు, ఎ.కె.సిక్రీ, ఎ.ఎం.ఖనవిల్కర్, డి.వై. చంద్రచూడ్, అశోక్ భూషణ్‌లతో కూడిన ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం అటార్నీ జనరల్ కె.కె. వేణుగోపాల్‌కు చెప్పింది. ఆధార్ కలిగి లేని వారికి సామాజిక భద్రతా ప్రయోజనాలు ఈ రోజుకీ తిరస్కరించబడుతున్నాయంటూ పిటీషనర్లలో ఒకరి తరపున హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ వాదించిన తర్వాత ధర్మాసనం పై విధంగా వ్యాఖ్యానించింది. ఏజీ మాట్లాడుతూ ఏ ఒక్కరికీ ప్రయోజనాలను నిరాకరించడం లేదని, ప్రభుత్వం ఇప్పటికే ఆధార్ పొందేందుకు మార్చి 31 వరకు గడువును పొడిగించిందని తెలిపారు. అయితే ఆధార్ లేని దారిద్ర్య రేఖకు దిగువున ఉన్న ప్రజలకు వితంతు పింఛన్లు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, పోషకాహారం, ఆహారం వంటి ప్రాథమిక అవసరాలను నిరాకరిస్తున్నట్లు వస్తున్న వార్తలను సిబాల్ ఈ సందర్భంగా ఉటంకించారు. వారికి అటు వంటి ప్రయోజనాలు నిరాకరించకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోర్టును కోరారు. ప్రజలకు అటువంటి ప్రయోజనాలు నిరాకరించకుండా మంత్రిత్వ శాఖలను, విభాగాలు ప్రత్యామ్నాయ పద్ధతులను ఉంచాలంటూ 2017, డిసెందరు 9న కేబినేట్ కార్యదర్శి జారీ చేసిన నోట్‌ను సిబాల్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. వ్యక్తి గోప్యతకు ప్రాథమిక హక్కును ఇది ఉల్లంఘించినట్టేనంటూ ఆధార్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ సిబాల్ తన వాదనను కొనసాగించారు. రేషన్ కార్డు, ఓటరు ఐడీ కార్డు లేదా ఇతర గుర్తింపుల ఆధారంగా ఆ ప్రయోజనాలను కొనసాగించాలని అటార్నీ జనరల్‌చ అదనపు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను జస్టిస్ చంద్రచూడ్ ఆదేశించారు.



# హర హర మహా దేవ..!
# శంభో శంకర..!!

**శివుడు,పార్వతి కల్యాణం జరిగిన రోజునే మహాశివరాత్రిగా హిందువులంతా భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు. అంతేకాక శివరాత్రి సివరాత్రి, శైవరాతిరి, శైవవరాత్రి, మరియు శివరాతిరి అనికూడా దీనిని అంటారు.**

**ప్రాశస్త్యం :** చాంద్రమాన నెల లెక్కింపు ప్రకారం అమావాస్య ముందు మాఘమాసంలో కృష్ణ పక్ష చతుర్దశి రోజు మహా శివరాత్రి జరుపుకొంటారు. హిందువుల పండుగలలో మహాశివరాత్రి ప్రశస్తమైనది. ఏటా మాఘ మాసం బహుళ చతుర్దశి నాడు చంద్రుడు శివుని జన్మనక్షత్రమైన ఆరుద్ర యుక్తుడైనప్పుడు వస్తుంది. శివుడు ఈ రోజు లింగాకారంగా ఆవిర్భవించాడని శివపురాణంలో ఉంది.

చాంద్రమాన నెల లెక్క ప్రకారం, ఫిబ్రవరి లేదా మార్చి నెలలో ఈ పండుగ వస్తుంది. సంవత్సరంలో పన్నెండు శివరాత్రులలో మహా శివరాత్రి అత్యంత పవిత్రమైంది.

**బిల్వార్చన:** పండుగనాడు బిల్వ (మారేడు) ఆకులు శివుడికి, సమర్పణలు ద్వారా జరుపుకుంటారు. రోజుంతా ఉపవాసం ఉండి, రాత్రి అంతా జాగరణ చేస్తాం. ఇది శివ భక్తులకు అత్యంత పర్వదినం. శివభక్తులంతా తెల్లవారుజామున లేచి, స్నానం చేసి, పూజలు చేసి, ఉపవాసంతో రాత్రంతా జాగరణ చేస్తారు. మరునాడే ఇక భోజనం. రాత్రంతా శివ పూజలు, అభిషేకాలు, అర్చనలు, శివలీలా కథాపారాయణాలు జరుపుతారు. అన్ని శివక్షేత్రాలలో ఈ ఉత్సవం గొప్పగా జరుగుతుంది. పూర్వం శ్రీశైలం క్షేత్రంలో జరిగే ఉత్సవమును పాల్కురికి సోమనాథుడు పండితారాధ్య చరిత్రములో విపులంగా వర్ణించాడు. శైవుల ధరించే భస్మము, విభూతి తయారు చేయడం పవిత్రమైందని భావిస్తారు. రోజు అంతా భక్తులు "ఓం నమ: శివాయ", అని పవిత్ర మంత్రాన్ని పఠిస్తారు.

**ఆధ్యాత్మిక శక్తి :** తపస్సు, యోగాలను మంచిని చేయటానికి ముక్తి పొందడానికి నిర్వహిస్తారు. ఈ రోజు, ఉత్తర ధృవంలోని గ్రహ స్థానాలు అంతా బలమైన ఉత్ప్రేరకాలు చర్యతో ఒక వ్యక్తి ఆధ్యాత్మిక శక్తి పెంచడానికి సహాయంగా ఉంటాయి. మహా మృత్యుంజయ మంత్రం వంటి శక్తి వంతమైన పురాతన సంస్కృత మంత్రాల ప్రయోజనాలు శక్తి శివరాత్రి నాడు గొప్పగా పెరుగుతుంది.

**శివుడికి ఇష్టమైన రోజు**

భూమి యొక్క సృష్టి పూర్తి అయిన తరువాత, భక్తులు, పార్వతి దేవి కృతజ్ఞతలతో సంతోష పెడతామని శివుడ్ని కోరారు. అందుకు శివుడు జవాబుగా, అమావాస్య 14 రాత్రి, పాల్గుణ నెలలో కృష్ణ పక్షంలో, తన అభిమాన రోజు అని బదులిచ్చాడు. పార్వతి, ఆమె స్నేహితులకు ఈ పదాలు పునరావృతం చేసింది. వీరిలో నుండి ఆ పదం సృష్టి అంతా వ్యాపించింది.

**శివరాత్రి పూజా విధానాలు**

ఆ తరువాత బ్రహ్మ, విష్ణువు ఆదిగా గల దేవతలు శివుడిని ధూపదీపాలతో అర్చించారు. దీనికి మెచ్చిన శివుడు అక్కడి వారితో 'మీరీనాడు చేసిన పూజకు సంతసించితిని. ఈ రోజు నుండి నేను అవతరించిన ఈ తిథి శివరాత్రి పర్వదినముగా ప్రసిద్ధి చెందింది. ఈ రోజున ఉపవాసము చేసి భక్తితో నన్ను లింగ రూపముగా, సాకార రూపముగా ఎవరు అర్చిస్తారో వారికి మహాఫలము కలుగుతుంది" అని చెప్పారు. తాను ఈ విధంగా అగ్ని లింగరూపముగా ఆవిర్భవించిన ప్రదేశము అరుణాచలముగా ప్రసిద్ధిచెందిందని.

**జాగరణ :** జాగరణ అనగా ప్రకృతిలో నిరదాణమైయున్న శివశక్తిని, శివ పూజా భజన లీలా శ్రవణాదులతో మేల్కొలిపి, తాను శివుడై, సర్వమును శివ స్వరూపముగా భావించి, దర్శించుటమే జాగరణము. అప్పుడు శివపూజలో సాయుజ్యము, శివభజనలో సామీప్యము, శివభక్తులతో కూడి, శివ విషయములు ప్రసంగించుటలో సలోక్యము, శివధ్యానముతో సారూప్యము సిద్ధించునని ఆదిశంకరాచార్యులు మాట ప్రత్యక్ష సత్యమగును. ఈ నాలుగింటిని శివరాత్రి నాడు ప్రత్యక్షముగా సాధించుటయే శివరాత్రి జాగరణ. ఈ జాగరణ సమయంలో తామున్న గృహ ఆవరణలో, తమ స్వంత పంటపొలాల్లోనో అక్కడి మట్టితో అక్కడే శివలింగాన్ని తయారుచేస్తూ జాముకొక శివలింగం తయారుచేసి పూజిస్తారు.

**రుద్రాభిషేకం :** వేదాలలో నుండి ప్రత్యేమైన మంత్రాలను రుద్రసూక్తంగా పండితులచే పఠించబడుతుంది. దీనిని శివలింగానికి ప్రాత:కాలంలో పవిత్రస్నానం చేయిస్తారు. దీనినే రుద్రాభిషేకం అంటారు. శివలింగంతో బాటు గండకీ నదిలో మాత్రమే లభించే సాలిగ్రమం కూడా పూజలందుకుంటుంది. దీనిద్వారా మనసులోని మలినాల్ని తొలగించుకోవడమే ఇందులోని పరమార్థం.

– ఖాన్

## జమిలి ఎన్నికల కోసం రాజ్యాంగ సవరణ

**న్యూఢిల్లీ :** లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడాన్నే జమిలి ఎన్నికలు అంటారు. ఇందుకోసం రాజ్యాంగంలోని ఐదు ఆర్టికల్స్‌ను సవరించాల్సి ఉంటుందని కేంద్ర ఎన్నికల కమిషన్ తెలిపింది. ప్రధాని మోడీ, రాష్ట్రపతి జమిలీ ఎన్నికలపై సలహా కోరడంతో, ఈసీ ఈ అభిప్రాయాన్ని తెలిపిందని, కేంద్ర న్యాయమంత్రిత్వ శాఖ అంతర్గ నివేదిక వెల్లడించింది. జమిలీ ఎన్నికలకు మద్దతు తెలిపిన ఈసీ, దీనికోసం రాష్ట్రాల శాసనసభల కాలపరిమితిని పొడిగించడం లేదా తగ్గించడం చేయాలని తెలిపింది. దీని కోసం ఆర్టికల్ 83ను పార్లమెంటులో సవరించాలని సూచించింది. దీంతోపాటు ఆర్టికల్ 85, 172, 174, 356లను కూడా సవరించాల్సి ఉంటుందని పేర్కొంది. ఇవేకాకుండా దేశంలోని రాజకీయ పార్టీల అభిప్రాయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని, అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను ఇందులో భాగస్వాములను చేయాలని న్యాయశాఖ నివేదికలో వ్యక్తంచేసింది. రాజ్యాంగ సవరణకు పార్లమెంటు ఉభయ సభల్లోనూ 2/ 3 వంతు మెజార్టీ తప్పనిసరని స్పష్టం చేసింది. ఎన్నికల నిర్వహణకోసం ముఖ్యంగా ఈవీఎంలు/ వీవీప్యాట్‌ల కోసం రూ.2000 కోట్లు అదనంగా కేటాయించాల్సి ఉంటుందని, ఎందుకంటే ఓటింగ్ యంత్రాలు కేవలం మూడు లేదా నాలుగుసార్లు మాత్రమే వినియోగించే అవకాశం ఉంటుందని ఈసీ తెలిపింది. జమిలి ఎన్నికల కోసం రాజ్యాంగ సవరణ చేయాలంటే రాజ్యసభలో కేంద్రం ముందుగా ప్రయివేట్ బిల్లును ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. అక్కడ ఆమోదం పొందితే లోక్‌సభకు, అక్కడ నుంచి రాష్ట్రాల శాసనసభలకు పంపాలి. ఈ విధానం అనుసరించకపోతే ప్రభుత్వానికి వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టే అవకాశం ఉంటుందని, ఈ సమయంలో రెండు సభల్లోనూ ప్రభుత్వానికి అనుకూలంగా ఫలితం వస్తే సవరణ నెగ్గినట్టేనని ఈసీ తన అభిప్రాయాన్ని తెలియజేసింది.

# వెన్నుపోటుతో విశ్వసనీయత సమాధి




అడ్డదిడ్డంగా రాష్ట్రాన్ని విభజించారని ఇంకెంత కాలం బీజేపీ నేతలు కాంగ్రెసును ఆడిపోసుకుంటారు. అలా చేశారనేకదా రాష్ట్ర ప్రజలు ఎన్నో ఆశలతో టీడీపీ- బీజేపీలను గెలిపించింది. అయినా నాలుగేళ్లలో ముంతడు మట్టి, చెంబుడు నీళ్లు ఇచ్చి ఇంకా ఇతరులపై నెపాన్ని నెట్టేందుకు ఎందుకు ప్రయత్నిస్తున్నారు ? ఇంతకాలం రాష్ట్ర ప్రజలకు బీజేపీ ఏం చేసింది ? మరుగుదొడ్లు, స్వచ్ఛభారత్, పేదల ఇళ్లు రహదారుల నిర్మాణాలు అని చెప్పడం ఎంత హాస్యాస్పదం ? అవి ప్రతి రాష్ట్రంలోనూ చేపట్టే పనులే కదా .. తల్లిని చంపి బిడ్డను చంపారన్న ప్రధాని మోడీ పదేళ్లపాటు ప్రత్యేక హోదాతోపాటు, ఢిల్లీ కంటే అత్యుత్తమ రాజధానిని నిర్మిస్తామని ఇప్పుడు ఈ వెన్నుపోటేంటి ? నాలుగేళ్లుగా ఓపిక పట్టి సహనం కోల్పోతున్న ప్రజలతో పరాచికాలా ? అధికారంలో ఉన్నామని రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు, ప్రధానిమోడీ, కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీ, హోం శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లు రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష సభ్యులను హెచ్చరించడం తెలుగు ప్రజలకు పుండుమీద కారం చల్లినట్లుందని కాంగ్రెస్‌లా బీజేపీ కూడా రాష్ట్ర ఎన్నికల్లో సమాధి అయితేగాని తెలిసేట్లు లేదు.

తెలుగువారి ఆక్రోశాన్ని చులకనగా చూడటం మహానేరం. విశ్వసనీయతలేని రాజకీయాలు ఎంతోకాలం మనలేవు. ఎన్నికల వాగ్దానాల్లో వందరోజుల్లో ప్రతి వారి ఎకౌంట్లో 15 లక్షల రూపాయలు, ఏడాదికి కోటి ఉద్యోగాలు, రైతుల ఆదాయం రెట్టింపునకు స్వామినాథన్ సిఫార్సులపై నిలదీసిన ప్రజలకు అవన్నీ జుమ్లా (ఉత్తుత్తి మాటలుగా) చెప్పడం వారికే చెల్లింది. నోట్లరద్దు, జీఎస్టీ అమలుతో ప్రజలను నిలువునా ముంచి, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ, లౌకికతత్వానికి ముప్పు తెస్తూ మతోన్మాదాన్ని, కులాలకుంపట్లను రాజేస్తున్న బీజేపీ తన పద్దతులు మార్చుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. రాష్ట్ర ప్రజలనే కాకుండా, దేశప్రజలను మూకుమ్మడిగా వంచించిన కేంద్ర ప్రభుత్వం ఇంకెంతోకాలం మనుగడ సాధించలేదు. పదేపదే రాముడి జపం చేసే వారంతా గుర్తుంచుకోవాల్సింది ఒక్కటే రాముడికి ఒకటే బాణం.. ఒకటే మాట.. అది లేకపోతే ప్రజలు ఆయా నేతలను అగ్ని ప్రవేశం చేయించక మానరు.

**వాస్తవాన్ని గుర్తించకపోతే గల్లంతే**

ప్రజా వంచనతో ముందుకెళుతున్న బీజేపీ రాజస్థాన్ ఉప ఎన్నికల్లో రెండు లోక్‌సభ స్థానాలు, మరో అసెంబ్లీ స్థానం పోగొట్టుకున్నా ఇంకా బుద్ధి తెచ్చుకోవడం లేదు. ఈ ఏడాది ద్వితీయార్థంలో ఆరాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతూ ఇంకా జుమ్లాతోనే గెలుస్తామనుకుంటే అత్యాశే అవుతుంది. 2014లో ఒక్క స్థానం కూడా లేని కాంగ్రెస్ ఈ ఉప ఎన్నికల్లో అనూహ్యంగా పుంజుకొని మండల్‌గఢ్ అసెంబ్లీ స్థానం, అజ్మీర్, అల్వార్ లోక్‌సభ స్థానాలను గెలుచుకోవడం బీజేపీ పతనానికి నాందిగా గుర్తించవచ్చు. ఈ మూడుస్థానాలు బీజేపీవే వీరంతా మృతి చెందడంతో ఉప ఎన్నికలు జరపాల్సి వచ్చింది.

ఆ ఆక్రోషం కొద్దీ లోక్‌సభ, రాజ్యసభల్లో గంటన్నరపాటు ప్రసంగించి ఆపార్టీపై తన అక్కసును వెలగక్కారు, కాని దిద్దుబాటు చర్యలు చేపట్టడంలో మాత్రం ముందుకు రావకపోవడం ఆ పార్టీ పతనానికి నాంది పలకవచ్చు. రాజస్థాన్‌లోని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ అనూహ్యంగా పుంజుకొని మండల్‌గఢ్ అసెంబ్లీ స్థానంలో విజయకేతనం ఎగరవేసింది. అలాగే అజ్మీర్, అల్వార్ లోక్‌సభ స్థానాల ఉప ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. ఈ మూడు స్థానాల్లో విజయం.. కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నింపుతోంది. ఈ విజయంతో జైపూర్‌లోని కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యాలయం సంబరాలతో కోలాహలంగా మారగా.. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయం జనంలేక వెలవెలపోయింది. రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలకు కేవలం ఏడు నెలల ముందు జరిగిన ఈ ఉప ఎన్నికలను అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. అసెంబ్లీ పోరుకు సెమీఫైనల్‌గా భావించి.. సీఎం వసంధరారాజే, రాజస్థాన్ కాంగ్రెస్ చీఫ్ సచిన్ పైలట్ హోరాహోరీగా ప్రచారం చేశారు. గత లోక్‌సభ ఎన్నికల్లో అజ్మీర్ నుంచే సచిన్ పైలెట్ అపజయం పాలైనప్పటికీ ఆయనతోపాటు పీసీజోషీ, జితేంద్రసింగ్‌భన్వర్‌లు పార్టీ విజయానికి కృషి చేశారు. రాజస్థాన్‌లో బీజేపీకి ఎదురుగాలి ప్రారంభమైంది.

# ప్రపంచ శాంతికి బుద్ధం...శరణం..గచ్ఛామి...





అశాంతి,అసమానతలతో కొట్టిమిట్టాడుతున్న నేటి భారతావనికి బౌద్ధం మాత్రమే దారి చూపుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు.

విజయవాడ పీడబ్ల్యూడీ గ్రౌండ్‌లో ప్రపంచ శాంతికోసం జరిపిన ప్రార్థనల్లో దక్షిణ కొరియా, చైనా , మయన్మార్, థాయిలాండ్, శ్రీలంక, జపాన్ మయన్మార్‌కు చెందిన దాదాపు 1000 మంది బౌద్ధ భిక్షులు పాల్గొన్నారు.

బౌద్ధ బోధనలతో విలసిల్లిన ప్రదేశం ఆంధ్రరాష్ట్రం. ఇక్కడ దాదాపు 200 బౌద్ధ ఆరామాలు ఉన్నాయి. నాగార్జునుడు అనేక మందికి తన అమూల్యమైన సందేశాలను, అనేక శాస్త్రాలను ఇక్కడే బోధించాడు. అష్టాంగ మార్గమైన సత్‌వాక్కు,సత్ క్రియ, సత్ జీవనం,సత్ శ్రమ, సత్ ఆలోచన, సత్ ధ్యానము, సత్ నిశ్చయము,సత్ దృష్టిలతో శాంతియుత, సహజీవనం చేసి పసిడి పంటలతో ఇక్కడి ప్రజలు సుఖ సంతోషాలతో నివసించారు. అందుకే అమరావతి ప్రాంతాన్ని అప్పటిలోనే ధాన్య కటకంగా పిలిచేవారు. దేశంలోని పలుప్రాంతాల్లో ఆర్యుల రాకతో అప్పటి దేశ పరిస్థితులు చాలా ఘోరంగా ఉండేవి. మనువాదం ప్రజలను మతాలుగా, కులాలు,వర్గాలుగా విడదీసింది. యజ్ఞాలు యాగాలుపేరుతో జంతుబలులు తీవ్రంగా ఉండేవి. సమాజంలో అసమానతలు, ధనిక పేద తారతమ్యాలు హెచ్చుగా ఉండేవి. అయితే ఈ ప్రాంతం మాత్రం సుఖసంతోషాలతో తులతూగుతుండేది. కృష్ణానది పరివాహక ప్రాంతమంతా విజ్ఞాన వెలుగులో నిండి ఉండేది. ఎంతో మంది విదేశీయుల ఇక్కడ విద్యాభ్యాసానికి వచ్చేవారు. ప్రపంచానికి అహింస, దయ, ప్రేమ, భోగ విసర్జన, సత్యం ఈ దేశం నుంచి మరీ ముఖ్యంగా ఆంధ్రరాష్ట్రం నుంచి ప్రపంచ ప్రజలు నేర్చుకున్నారని తెలుసుకోవాలి. దేశంలో అనేక ప్రాంతంలో బౌద్ధ మహాసభలు జరిగేవి. వాటినే సంగీతి అనేవారు. బౌద్ధుల నిర్యాణాన్ని మహా పరి నిర్యాణమని అంటారు. బుద్ధుడి అస్తికాలపై నిర్మించిన కట్టడాలను స్థూపాలని, ప్రార్థనాలయాలను చైతన్యాలని, విశ్రాంతి మందిరాలను ఆరామాలని అంటారు. అనార్యులంతా బౌద్ధ బోధనలతో సచ్ఛీలత, సత్యం, ప్రేమ కలిగి ఉండేవారు.

ఈ మతాన్ని అనుసరించేవారు ప్రపంచవ్యాప్తంగా 50కోట్ల వరకు ఉన్నారు. మన దేశంలో అత్యున్నత విద్యావంతులంతా ఈ మతంలోనే ఉండటం విశేషం. బౌద్ధమతం ఆరంభ దశనుండి ఆంధ్రప్రదేశ ప్రాంతలో విశేషమయన ఆదరణ పొందింది. బుద్ధుని కాలం నుండే రాష్ట్రంలో బౌద్ధమతం ప్రాచుర్యంలో ఉందనడానికి అనేక చారిత్రక ఆధారాలున్నాయి. గుంటుపల్లి, భట్టిప్రోలు వంటి బౌద్ధ క్షేత్రాలు హీనయాన బౌద్ధం కాలం నాటివి. (క్రీ.పూ. 300 నాటివి.) విశేషించి భట్టిప్రోలును బుద్ధుడే స్వయంగా సందర్శించాడని ఒక అభిప్రాయం ఉంది. భట్టిప్రోలులోని ధాతు కదరం బుద్ధుని శరీర ధాతువులకు చెందినది కావచ్చును. అశోకుని కాలంలోను, తరువాత శాతవాహనుల కాలంలోను బౌద్ధాన్ని రాజకుటుంబాలు విశేషంగా ఆదరించారు. ధరణికోట, విజయపురి వంటి మహారామాలు ఆంధ్రదేశంలో బౌద్ధం అత్యున్నత స్థితిలో విరాజిల్లిందనడానికి చిహ్నాలు. గౌతమ బుద్ధుడు స్వయంగా ధాన్యకటకం (అమరావతి) వద్ద కాలచక్రతంత్రం ప్రవర్తింప చేశాడని, ధారణులను నిక్షిప్తం చేశాడని, అందువల్ల అమరావతి ధరణికోట అయ్యిందని జర్మన్ పండితుడు 'హాలెంట్ హాఫ్‌మాన్' తన పరిశోధనలో వెల్లడించాడు. అమరావతి స్థూపంలో బుద్ధుడి ధాతువులను నిక్షిప్తం చేసినట్లు 'మంజుశ్రీ మూలకల్పం' బౌద్ధ గ్రంథం పేర్కొంది. ఆంధ్ర దేశంలో అతి ప్రాచీన భట్టిప్రోలు స్థూపంలో భట్టిప్రోలు శాసనం ప్రకారం 'బుద్ధ శరీరాన్ని నిక్షిప్తం' అని రాశారు. భట్టిప్రోలు, అమరావతి, నాగార్జునకొండ, ఘంటశాల, జగ్గయ్యపేట, ఆదుర్రు, శాలిహుండం, ఫణిగిరి, చందవరం, రామతీర్థం, శంకరం, కోటిలింగాల, కొండాపూర్, పెదగంజాం, చినగంజాం మొదలైన ప్రాంతాల్లో స్థూపాలు, చైత్యగృహాలు, విహారాలు బయల్పడ్డాయి. అశోకుడి శిలా శాసనాలు ఆంధ్ర దేశంలో కర్నూలు జిల్లాలోని ఎర్రగుడి, రాజులమందగిరిల్లో లభించాయి. ఇటీవల విశాఖపట్నం జిల్లా బావికొండ దగ్గర బుద్ధుడి పవిత్ర ధాతువులు లభించాయి. కరీంనగర్ జిల్లా ధూళికట్టలో స్థూపం బయటపడింది. శ్రీకాకుళంలో వంశధార నది ఒడ్డున శ్రీముఖలింగ శైవ క్షేత్రం ఉంది. ఇక్కడ జరిపిన తవ్వకాల్లో క్రీ.శ 8, 9 శతాబ్దాల నాటి అమితాబ, అక్షోభ్య (బుద్ధుడు), ఉపనీహవిషయ (స్త్రీ)మూర్తులు బయల్పడ్డాయి. ఇవి బౌద్ధమతానికి చెందినవి. నల్గొండ జిల్లా ఫణిగిరిలో గాజులబండ, తిరుమలగిరి ప్రాంతాల్లో బౌద్ధ అవశేషాలు లభ్యమయ్యాయి. బుద్ధుడి బోధనలతో అహింసా ధర్మాలతో విలసిల్లిన ఈ ప్రాంతంలో ప్రపంచ శాంతికోసం ప్రార్థనలు జరపడం సంతోషదాయకం. లోకా సమస్తా సుఖినోభవంతు...

– ఖాన్

# రేగు పండ్లతో కలిగే లాభాలు ...



ఆరోగ్యం

పులుపు, తీపి రుచుల కలయికతో ఉండే రేగు పండ్లు మనకు ఈ సీజన్‌లో ఎక్కువగా లభిస్తాయి. ఇవి ఉష్ణ మండల ప్రాంతాల్లో ఎక్కువగా పండుతాయి. మన దేశంలో అనేక ప్రాంతాల్లో రేగు పండ్లు పండుతాయి. వీటిల్లో 40 జాతులకు పైగా ఉన్నాయి. పసుపు, కాఫీ రంగులు కలిసి, ఎరుపు లేదా బ్రిక్ రెడ్, గ్రీన్ తదితర రంగుల్లో ఇవి మనకు లభిస్తున్నాయి. ఇక కొన్ని రేగు పండ్లు పరిమాణంలో చిన్నవిగా ఉంటాయి. మరి కొన్ని పెద్దవిగా ఉంటాయి. ఈ క్రమంలోనే ప్రతి ఏటా సంక్రాంతి సమయంలో భోగి రోజున ఈ పండ్లను భోగి పండ్ల పేరిట చిన్నారులపై పోస్తారు. దీంతో వారు భోగభాగ్యాలతో తులతూగుతారని పెద్దల నమ్మకం. అయితే ఇదే కాకుండా రేగు పండ్లను ఈ సీజన్‌లో తినడం వల్ల మనకు అనేక ఆరోగ్యకర ప్రయోజనాలు కలుగుతాయి. అవేమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

- రేగు పండ్లలో వివిధ రకాల పోషక పదార్థాలు సమృద్ధిగా ఉంటాయి. సి విటమిన్ వీటిలో ఎక్కువగా ఉంటుంది. జామకాయ తరువాత ఈ విటమిన్ వీటిలోనే ఎక్కువగా ఉంటుంది.
- రేగు పండ్ల ఆకులను రెండింటిని ప్రతి రోజూ ఒకటి లేదా రెండు పూటల పాటు చిన్నారులకు తినిపిస్తే వారికి కలిగే అనారోగ్యాలు తగ్గుముఖం పడతాయి.
- కడుపులో మంటను తగ్గించే గుణం రేగు పండ్లకు ఉంది. అజీర్తికి బాగా పనిచేస్తాయి. గొంతు నొప్పి, ఆస్తమా, కండరాల నొప్పులను ఇవి తగ్గిస్తాయి.
- రేగు పండ్ల గింజలను పొడి చేసి నూనెతో కలిపి రాసుకుంటే కీళ్ల నొప్పులు తగ్గుతాయి. రేగు చెట్టు బెరడును నీటిలో మరిగించి డికాక్షన్‌లా చేసుకుని తాగితే నీళ్ల విరేచనాలు తగ్గుతాయి.
- చేతి నిండుగా రేగు పండ్లను తీసుకుని ఒక అరలీటరు నీటిలో వేసి అవి సగం అయ్యే వరకు మరగనివ్వాలి. ఆ ద్రవానికి చక్కెర లేదా తేనె కలిపి దాన్ని ప్రతి రోజూ రాత్రి నిద్రించే ముందు తాగితే చక్కని ఆరోగ్యం చేకూరుతుంది. ఈ మిశ్రమంలో ఉండే గ్లుంటామిక్ యాసిడ్ మెదడు బాగా పనిచేసేందుకు ఉపయోగపడుతుంది.
- జ్వరం, జలుబు రాకుండా ఉండాలంటే తరచూ రేగు పండ్లను తినాలి. రేగు చెట్టు బెరడుతో చేసిన కషాయం మలబద్ధకానికి మంచి ఔషధంగా పనిచేస్తుంది. రేగు ఆకులను నూరి దాన్ని కురుపుల వంటి వాటిపై రాస్తే త్వరగా నయమవుతాయి.
- బరువు పెరిగేందుకు, కండరాలకు బలాన్నివ్వడంలో, శరీరానికి శక్తినిచ్చేందుకు రేగు పండ్లు చక్కగా ఉపయోగపడతాయి.
- శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. క్యాన్సర్‌కు వ్యతిరేకంగా పోరాడే ఔషధ గుణాలను ఇవి కలిగి ఉన్నాయి. రక్తాన్ని శుద్ధి చేస్తాయి.

# డీపీఆర్‌లు, యూసీలు ఎప్పుడో ఇచ్చాం : మంత్రి నారాయణ

**రాజధాని ప్రతినిధి, అమరావతి :** రాజధాని నిర్మాణానికి డీపీఆర్‌లు ఇవ్వలేదని బీజేపీ నేతలు చెప్పడాన్ని పురపాలక శాఖ మంత్రి నారాయణ ఖండించారు. కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం చేసిందే కాకుండా తెలుగుదేశం ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేయటాన్ని ఆయన తప్పుబట్టారు. డీపీఆర్‌లను సంబంధించిన సమగ్ర వివరాలను, కేంద్రం ఇచ్చిన నిధుల వివరాలను పేర్కొన్నారు. రాష్ట్ర రాజధాని నిర్మాణానికి రూ.11,600 కోట్లు కోరుతూ డీపీఆర్ ఎప్పుడో అందజేశామని, అయితే కేంద్రం కేవలం రూ.1500 కోట్లు మాత్రమే ఇచ్చిందన్నారు. ఇప్పటి వరకూ చేపట్టిన పనులకు యూసీలు కూడా అందజేశామని, మరో రూ.1000 కోట్లు గుంటూరులో అండర్ గ్రౌండ్ డ్రేనేజీ విజయవాడలో మురుగు నీరు తరలింపు పనులకు ఇచ్చారన్నారు. ఈ ప్రాజెక్టుల పూర్తికి మూడేళ్ల కాల వ్యవధిగా నిర్ణయించారన్నారు. రాష్ట్రంలో 11 కేంద్ర విద్యా సంస్థలు ఏర్పాటుకు పునర్విభజన చట్టంలో పేర్కొన్నారన్నారు. ఇందుకోసం రూ.11 వేల ఖర్చువుతుందని ఆ చట్టంలో తెలిపారన్నారు. ఇంత వరకూ కేవలం రూ.ఐదారు కోట్లు మాత్రమే ఇచ్చారని తెలిపారు. ఇలా అయితే 20 ఏళ్లయినా కేంద్ర విద్యా సంస్థల భవనాల నిర్మాణం పూర్తికాదన్నారు. విశాఖ రైల్వే జోన్, కడపలో ఉక్కు పరిశ్రమ, దురరాజ పట్నం పోర్టు, విశాఖ-చెన్నై కారిడార్ ఊసేలేదన్నారు. అడక్కుండానే బెంగళూరు మెట్రోకు రూ.15 వేల కోట్లు, ముంబయి, అహ్మదాబాద్ మెట్రోకు రూ.లక్ష కోట్లు ఇచ్చారన్నారు. విశాఖ, విజయవాడ మెట్రోకు రూపాయి కూడా బడ్జెట్‌లో కేటాయించలేదన్నారు. పునర్విభజన చట్టంలో పేర్కొన్న అంశాలను అమలు చేయాలనే తమ ప్రభుత్వం కోరుతుందన్నారు. ఇందుకోసం పార్లమెంట్‌లో తమ పార్టీ ఎంపీలు పోరాడుతున్నారన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం జరగడంపై టీడీపీ ప్రభుత్వం పోరాటం చేస్తుంటే, తమ పోరాటాన్ని అడ్డుకోవడానికి యత్నిస్తున్న ప్రతిపక్ష వైసీపీ నాయకుల తీరు దురదృష్టకరమని మంత్రి నారాయణ మండిపడ్డారు.

Printed & Published by Shri Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor Shri Pattan Hussain Khan. RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2016-18, Cell 9440662699, Email : info@rajadhanivartalu.com